తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | గురువారం - 19 - ఫిబ్రవరి 2026 | సంపుటి:3 | సంచిక:262 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in



## రహదారులు, సినిమాటోగ్రఫీ శాఖలపై
# ప్రీ-బడ్జెట్ సమీక్ష

- లక్ష కోట్ల నిధులతో రహదారి ప్రాజెక్టులకు వేగం
- రీజినల్ రింగ్ రోడ్డుకు రుణంపై గ్రీన్ సిగ్నల్
- సాంస్కృతిక కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధికి ప్రణాళిక
- ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క



**హైదరాబాద్, ఫిబ్రవరి 18, (తెలంగాణ ముచ్చట్లు):**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖలపై ప్రీబడ్జెట్ సమీక్షా సమావేశాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మరియు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


మిగతా 2లో..

## రాజ్యసభ అభ్యర్థులపై అధిష్టానం తుది నిర్ణయం: మహేష్ గౌడ్

- పార్టీ నిర్మాణంపై రేపు సమీక్ష సమావేశం
- స్థానిక సంస్థల్లో బీసీలకు ప్రాధాన్యం ఇచ్చామన్న పిసిసి చీఫ్
- రాజ్యసభ టికెట్ అంశం అధిష్టానం పరిధిలోనేనని స్పష్టం

2లో





## హైదరాబాద్‌ను గ్రీన్ నెట్ జీరో సేవల హబ్‌గా అభివృద్ధి చేస్తాం: సీఎం

# గ్రీన్ ఎనర్జీతో తెలంగాణ భవిష్యత్తు

- 2034 నాటికి ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్యం
- విద్యుత్ ఉత్పత్తిలో 25% ఇప్పటికే గ్రీన్ సోర్సుల నుంచే
- తయారీ రంగానికి ప్రత్యేక జోన్లు
- "చైనా+1" వ్యూహంలో తెలంగాణకు ప్రాధాన్యం
- ఈవీల తయారీకి తెలంగాణ సిద్ధం..
- మూసీ పునరుద్ధరణ, సరస్సుల సంరక్షణ, హైడ్రా ప్రత్యేక దళం..
- పెట్టుబడులు, ఉపాధి సృష్టితో పాటు సుస్థిరతకు సమాన ప్రాధాన్యం

**హైదరాబాద్, ఫిబ్రవరి 18, (తెలంగాణ ముచ్చట్లు):**

గ్రీన్ ఎనర్జీ ప్రపంచ పరిరక్షణకు లాభదాయకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తెలంగాణలో గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ఆర్థికవ్యవస్థలో గ్రీన్ఎనర్జీని ప్రోత్సహిస్తున్నట్టు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం లోనే ఈవీల తయారీ కోసం చర్చలు జరుపుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 30 లక్షలకుపైగా పంప్‌సెట్‌లు, దాదాపు 50 లక్షల గృహాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. ఈ శక్తిని బొగ్గు, సాంప్రదాయ ఇంధన వనరుల నుంచి సోలార్, గ్రీన్ ఎనర్జీ వైపు మార్చడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. కాలుష్య నియంత్రణ, రీసైక్లింగ్, స్థిర శక్తి ఉత్పత్తి పద్ధతులపై నిరంతరం పరిశోధనలు కొనసాగిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌ను 2034 నాటికి నెట్ జీరో నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

మిగతా 2లో..

## ధరణి దోపిడిపై ఉక్కుపాదం
# కోడ్ ఆడిట్‌కు ఆదేశాలు

- వ్యవస్థాగత లోపాలపై ఉన్నత స్థాయి విచారణ
- స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీల అక్రమాల వెలికితీత
- భూభారతి పోర్టల్‌ను ప్రజలకనుకూలంగా రూపకల్పన
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, ఫిబ్రవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):**

ధరణి పోర్టల్ వ్యవహారంపై రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తీగ లాగితే డొంక కదిలినట్లుగా ధరణి వ్యవహారం ఉందని, ప్రజల ఆస్తుల రక్షణ కోసం రూపొందించిన వ్యవస్థను కొంతమంది స్వార్థ ప్రయోజనాలకు వాడుకున్నారని మండిపడ్డారు. సచివాలయంలో ఉన్నత స్థాయి కమిటీతో సమీక్ష నిర్వహించారు. ధరణి పోర్టల్‌లోని లోపాలను ఆసరాగా చేసుకుని స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీలను కొల్లగొట్టిన ఘటనపై ఉన్నత స్థాయి కమిటీ విచారణ జరిపిందని తెలిపారు.

మిగతా 2లో..

## బాల్క సుమన్ అరెస్ట్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు

- అక్రమ అరెస్ట్ అంటూ కాంగ్రెస్‌పై ధ్వజమెత్తిన కేటీఆర్
- క్యాతన్‌పల్లి మున్సిపాలిటీపై కుట్ర ఆరోపణ
- సుమన్‌ను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్



2లో

## అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ

- జీవో ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా అమలు
- ముద్రిత, ఎలక్ట్రానిక్, డిజిటల్ జర్నలిస్టులకు అవకాశం
- ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

**హైదరాబాద్, ఫిబ్రవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):**




రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ జీవో సంఖ్య రెండు వందల యాభై రెండు ప్రకారం అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు సమాచార మరియు పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ సి హెచ్ ప్రియాంక తెలిపారు. ముద్రిత, ఎలక్ట్రానిక్, డిజిటల్, ఫ్రీలాన్స్ మరియు వేటరన్ జర్నలిస్టులు ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి ప్రత్యేక పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు.

మిగతా 2లో..

## ఐబొమ్మ నిర్వాహకుడు ఇమంది రవి జైలు నుంచి విడుదల

పైరసీ కేసులో షరతులతో కూడిన బెయిల్
కఠిన నిబంధనలు విధించిన హైకోర్టు






2లో




## విడాకుల పగతో మాజీ భార్య హత్య

- ప్రతీకార భావంతో దారుణానికి పాల్పడిన మాజీ భర్త
- అపార్టుమెంట్‌లో కలకలం, పెట్రోల్‌తో బెదిరింపు
- నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించిన స్థానికులు

2లో

## అర్హులైన ప్రతి పేదకూ ఇందిరమ్మ ఇల్లు

- మంత్రి పొన్నం ప్రభాకర్
- లబ్ధిదారుల ఎంపికపై సమీక్ష..
- ఎల్ వన్ కింద 4800 మందికి నిధులు
- G+5 నుంచి 10 అంతస్తుల నిర్మాణాల ప్రణాళిక



**హైదరాబాద్, ఫిబ్రవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్ జిల్లాలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సచివాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, రెండు పడకల గదుల ఇండ్ల పురోగతిపై చర్చించారు. ప్రభుత్వం ఇళ్ల మంజూరులో పారదర్శకత పాటిస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు నిర్మించి అందించడమే లక్ష్యమని తెలిపారు. ఎల్ వన్ కింద నాలుగు వేల ఎనిమిది వందల మందికి రెండు పడకల గదుల ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. ఎల్ టు కింద హైదరాబాద్ జిల్లాలో నాలుగు లక్షల ఇరవై రెండు వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

మిగతా 2లో..

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# అర్హులైన ప్రతి పేదకూ ఇందిరమ్మ ఇల్లు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ మహానగరంలో భూముల సేకరణ చేసి జీ ప్లస్ ఐదు నుంచి పది అంతస్తుల వరకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న రెండు పడకల గదుల ఇళ్ల పనులను త్వరితగతిన పూర్తి చేసి అర్హులకు అందించాలని అధికారులకు ఆదేశించారు. ఖాళీలు, లబ్ధిదారుల సంఖ్యపై వివరాలు సమీక్షించారు. మురికివాడల్లో ఇందిరమ్మ మోడల్ కాలనీల అభివృద్ధి, స్థలాల సేకరణ, అసంపూర్తి డబుల్ బెడ్ రూం ఇళ్ల పూర్తి, పూర్తయిన ఇళ్ల కేటాయింపు అంశాలపై ఎమ్మెల్యేల అభిప్రాయాలు స్వీకరించారు. సమావేశంలో జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తదితరులు పాల్గొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు.




# బాల్క సుమన్ అరెస్ట్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):** బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు తీవ్రస్థాయిలో స్పందించారు. ఇది పూర్తిగా అక్రమ అరెస్ట్ అని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని మండిపడ్డారు. మంచిర్యాల జిల్లాలోని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీని అడ్డదారుల్లో కైవసం చేసుకోవాలనే ఉద్దేశంతోనే ఈ కుట్రకు తెర లేపారని ఆరోపించారు. బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ కలిసి దౌర్జన్యంగా దాన్ని చేజిక్కించుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ కుట్రలో భాగంగానే సుమన్‌పై అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేయించారని పేర్కొన్నారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలకు వ్యతిరేకంగా క్యాతన్‌పల్లి ప్రజలు బంద్ పాటించినా ప్రభుత్వం స్పందించలేదని కేటీఆర్ అన్నారు. కొందరు పోలీసు అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తమ వైఖరి మార్చుకోకపోతే భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, అప్పటికి కాంగ్రెస్ నేతలు చేసిన చర్యలకు సమాధానం చెప్పాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. అక్రమ కేసులో అరెస్ట్ చేసిన బాల్క సుమన్‌ను ప్రభుత్వం తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని బీఆర్ఎస్ తరపున డిమాండ్ చేశారు.

### రహదారులు, సినిమాటోగ్రఫీ శాఖలపై

# ప్రీ-బడ్జెట్ సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో లక్ష కోట్లకు పైగా నిధులతో రహదారుల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రజల ప్రయాణ సౌకర్యం మెరుగుపరచడం, పెట్టుబడులను ఆకర్షించడం, ప్రాంతీయ సమతుల్య అభివృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. హెచ్ఏఎం నమూనా ప్రాజెక్టులు, రీజినల్ రింగ్ రోడ్, హైదరాబాద్-విజయవాడ కారిడార్, ఫ్యూచర్ సిటీ నుంచి బందర్ పోర్టు వరకు, రావిర్యాల నుంచి శ్రీశైలం వరకు కీలక రహదారి ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నట్లు వెల్లడించారు. రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణానికి హడ్కో నుంచి రుణం పొందేందుకు ప్రీబడ్జెట్ సమావేశంలో ఆమోదం తెలుపుతూ సంతకం చేసినట్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి బలోపేతమైన రహదారి మౌలిక వసతులు అత్యంత కీలకమని అన్నారు. అలాగే హైదరాబాద్‌ను దేశంలో ప్రముఖ సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా సినిమాటోగ్రఫీ శాఖ సంవత్సరం పొడవునా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, దృఢమైన అమలుతో తెలంగాణను మరింత ముందుకు తీసుకెళ్తామని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# ..అక్రిడిటేషన్ కార్డులు జారీ

(మొదటి పేజీ తరువాయి)

దరఖాస్తుల స్వీకరణ, కార్డుల జారీ ప్రక్రియ నిరంతర పద్ధతిలో కొనసాగుతుందని స్పష్టం చేశారు. దరఖాస్తు ప్రక్రియలో సాంకేతిక సమస్యలు ఎదురైతే కార్యాలయ వేళల్లో మీడియా రిలేషన్స్ విభాగాన్ని సంప్రదించాలని సూచించారు. ఉదయం పది గంటల ముప్పై నిమిషాల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సహాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రత్యేక కమిషనర్ పేర్కొన్నారు. పారదర్శక విధానంతో అక్రిడిటేషన్ ప్రక్రియను అమలు చేస్తామని తెలిపారు.

## బొల్లారం స్టేషన్‌లో రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌కు నిలుపుదల

**హైదరాబాద్, 18 ఫిబ్రవరి (తెలంగాణ ముచ్చట్లు):** అల్వాల్, బొల్లారం, కొంపల్లి ప్రాంత ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్ నిలుపుదల డిమాండ్‌కు ఎట్టకేలకు నెరవేరు లభించింది. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రత్యేక చొరవతో బొల్లారం రైల్వే స్టేషన్‌లో రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌కు నిలుపుదలకు కేంద్ర రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రాంత ప్రజలు ఎంతోకాలంగా ఈ డిమాండ్‌ను వ్యక్తం చేస్తూ వచ్చారు. ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపార వర్గాలకు ఈ రైలు నిలుపుదల ఎంతో ఉపయుక్తమవుతుందని భావిస్తున్నారు. స్థానిక అభివృద్ధి, రవాణా సౌకర్యాల మెరుగుదలలో ఇది కీలక అడుగుగా భావిస్తున్నారు. ఎంపీ ఈటల రాజేందర్ కేంద్ర రైల్వే అధికారులతో పలుమార్లు చర్చలు జరిపి ఈ అంశాన్ని ముందుకు తీసుకువచ్చినట్లు సమాచారం. ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన ప్రాధాన్యత అని ఆయన పేర్కొన్నారు. రాయలసీమ ఎక్స్‌ప్రెస్ నిలుపుదలతో మల్కాజ్‌గిరి పరిధిలో రైల్వే కనెక్టివిటీ మరింత బలపడనుంది. ప్రాంత అభివృద్ధికి ఇది మరో ముందడుగుగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# ..తెలంగాణ భవిష్యత్తు

(మొదటి పేజీ తరువాయి)

పట్టణాభివృద్ధిలో భాగంగా తాము కార్బన్ ఫుట్‌ప్రింట్ ఆడిట్ చేపట్టనున్న తొలి భారత నగరంగా హైదరాబాద్ నిలవబోతుందని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో కోర్ అర్బన్ రీజియన్(క్యూర్)లో దాదాపు పరిశ్రమలు ఉండవని స్పష్టం చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'క్లైమేట్ వీక్' సదస్సులో రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. బాంద్రా కుర్లా జియో కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ఉదయం జరిగిన ఈ సమావేశంలో దేశంలోని పట్టణాలు, నగరాభివృద్ధి, వాతావరణ మార్పులకు అనుగుణమైన విధానాలపై ముఖ్యమంత్రి తెలంగాణ దృక్పథాన్ని వివరించారు.

పట్టణాభివృద్ధికి సంబంధించిన సదస్సులో మాట్లాడడం తనకు సంతోషంగా ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 2047 లక్ష్యాన్ని అర్థం చేసుకోవాలంటే 1947 నుంచి భారత అభివృద్ధి ప్రయాణాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్ర్యం అనంతరం తొలి నాలుగు దశాబ్దాల్లో దేశంలో ప్రధాన ప్రాధాన్యతలు విద్యా వ్యవస్థ, నీటిపారుదల రంగాలేనని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాథమిక పాఠశాలల నుంచి IIT, IIM, IISC వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకున్నామని గుర్తు చేశారు. విద్యుత్, సాగునీటికి భారీ ఆనకట్టలను నిర్మించి రైతుల పొలాలను నీటితో అనుసంధానించామని తెలిపారు. 1990 నాటికి భారత్ ఆహార కొరత నుంచి ఆహార భద్రత సాధించిందని చెప్పారు. దీంతో ప్రజల జీవిత కాలం పెరిగిందని ముఖ్యమంత్రి అన్నారు.

శక్తివంతమైన దేశంగా భారత్

దేశంలోని ఇంజినీర్లు, వైద్యులు, శాస్త్రవేత్తలు ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమంగా గుర్తింపు పొందే విధంగా అభివృద్ధి సాధించిందని వివరించారు. 1991 నుంచి 2020 వరకు లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ సంస్కరణలతో భారత్ సేవా రంగంలో శక్తివంతమైన దేశంగా ఎదిగిందని సీఎం వివరించారు. టెలికాం , సాఫ్ట్‌వేర్ విప్లవంతో పట్టణ మౌలిక సదుపాయాల విస్తరణ సాధ్యమైందని అన్నారు. భారత నిపుణులు సిలికాన్ వ్యాలీ వంటి ప్రపంచ కేంద్రాల్లో విజయాలు సాధించారని తెలిపారు. 1991 తర్వాత గ్లోబల్ సాఫ్ట్ వేర్, టెక్ సంస్థలు తమ బ్యాక్ ఆఫీస్ కార్యకలాపాలకు భారత్‌ను ఎంచుకున్నాయని అన్నారు. అందుకే ప్రపంచంలో అత్యధిక గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు మన దేశంలో ఉన్నాయన్నారు. ఈ టెక్ పురోగతిలో తయారీ రంగం ఎక్కువగా అవకాశాలు కోల్పోయినట్లు అభిప్రాయపడ్డారు.

కోవిడ్ అనంతరం ప్రభుత్వాల దృష్టికోణం మారిందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం అభివృద్ధి వ్యూహంలో తయారీ రంగం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిరత్వం కీలకంగా మారాయని అన్నారు. ఏ ఆర్థిక వ్యవస్థకైనా విద్యుత్ ఉత్పాదక వనరులే అసలైన కరెన్సీ అన్నారు. విద్యుత్ ఉత్పత్తి, వినియోగం అభివృద్ధికి కొలమానంగా నిలుస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను ప్రస్తావిస్తూ, రాష్ట్ర జీడీపీని 200 బిలియన్ డాలర్ల స్థాయి నుంచి 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడం లక్ష్యమని తెలిపారు. భవిష్యత్ అభివృద్ధికి ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం, విద్య, నైపుణ్యాలు, వనరులు, ఉపాధి ప్రధాన స్తంభాలుగా నిలుస్తాయని అన్నారు. రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధికి తెలంగాణను CURE, PURE, RARE జోన్‌లుగా విభజించినట్లు ముఖ్యమంత్రి వివరించారు. హైదరాబాద్‌ను 160 కి.మీ. పొడవైన ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (CURE)గా ప్రకటించగా, ORR, 360 కి.మీ.ల రీజినల్ రింగ్ రోడ్ (RRR) మధ్య ప్రాంతాన్ని PURE జోన్‌గా రూపొందించి తయారీ రంగానికి నిర్దేశించినట్లు చెప్పారు. ఈ ప్రాంతాన్ని దేశంలోనే అతిపెద్ద తయారీ కేంద్రంగా అభివృద్ధి చేసి "చైనా +1" ప్రత్యామ్నాయంగా తెలంగాణను నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ తయారీ వృద్ధి గ్రీన్ ఎనర్జీ ఆధారంగా సాగుతుందని స్పష్టం చేశారు.

తెలంగాణ విద్యుత్ వినియోగంపై ముఖ్యమంత్రి గణాంకాలను వెల్లడించారు. రాష్ట్రం రోజుకు సగటున 16,610 మెగావాట్ల విద్యుత్ వినియోగిస్తోందని తెలిపారు. గత ఏడాది గరిష్ఠ డిమాండ్ 17,162 మెగావాట్లు నమోదైందని, ఈ ఏడాది అది 19,000 మెగావాట్లను దాటుతుందని అంచనాలున్నాయని వివరించారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో గరిష్ట డిమాండ్ 34,000 మెగావాట్లకు చేరుతుందని అంచనా వేశారు. రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తిలో సుమారు 24.8% లేదా దాదాపు 25% గ్రీన్ సోర్సుల నుంచే వస్తోందని తెలిపారు. అదేవిధంగా, 360 కిలోమీటర్ల పొడవు గల రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం కొనసాగుతోందని, రీజినల్ రింగ్ రైల్వే ప్రణాళికలు అమలులో ఉన్నాయని ముఖ్యమంత్రి అన్నారు.. ORR, RRR మధ్య ప్రాంతాన్ని ప్రధాన తయారీ జోన్‌గా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు, ముఖ్యంగా డేటా సెంటర్లు, పరిశ్రమలు గ్రీన్ ఎనర్జీని కోరుకుంటున్నాయని తెలిపారు. తెలంగాణ ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న క్రమంలో వనరుల పెరుగుదలలో ప్రధాన భాగం గ్రీన్‌గా ఉండాలని తన సంకల్పాన్ని వ్యక్తం చేశారు. వాతావరణ మార్పులు, కోవిడ్ ప్రభావాలను ప్రస్తావిస్తూ, ప్రస్తుత పరిస్థితిని క్లైమేట్ ఎమర్జెన్సీగా ముఖ్యమంత్రి అభివర్ణించారు. అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి సృష్టి, ఉత్పత్తి , వినియోగం పెంపు కొనసాగుతూనే పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ మూడు జోన్‌లలో గ్రీన్ స్ట్రాటజీని అవలంబించిందని చెప్పారు. హైదరాబాద్ CURE ప్రాంతంలో ఎలక్ట్రిక్ వాహనాలపై పన్నులు తొలగించడంతో దేశంలో అత్యధికంగా EVల స్వీకరణ పెరిగిందని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణలోనే EV తయారీ కోసం సంస్థలతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థను పర్యావరణహితంగా మార్చే దిశగా 2 లక్షలకుపైగా ఆటోరిక్షాలను రీట్రోఫిట్ చేస్తుండగా, 3,500 కంటే ఎక్కువ ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మారుస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ మెట్రోను ప్రస్తుత 71 కి.మీ. నుంచి 200 కి.మీ. పైగా విస్తరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. పరిశ్రమలను కోర్ అర్బన్ ప్రాంతం నుంచి పెరి అర్బన్ జోన్‌లకు తరలిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో భాగంగా మూసీ నది పునరుద్ధరణ, సరస్సులు, చెరువుల సంరక్షణ, వాటర్ గ్రిడ్, వనరుల నిర్వహణ ప్రణాళికలను ముఖ్యమంత్రి వివరించారు. హైడ్రా రూపంలో పర్యావరణ రక్షణకు ప్రత్యేక పోలీసు దళాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో వాతావరణ ప్రమాదాలను తగ్గించి నగరాన్ని సురక్షితమైన, వేగంగా అభివృద్ధి చెందే నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. తెలంగాణను మొత్తం దేశానికి ఆదర్శంగా నిలబెట్టడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

### విడాకుల పగతో

# మాజీ భార్య హత్య

**హైదరాబాద్, 18 ఫిబ్రవరి (తెలంగాణ ముచ్చట్లు):** నగరంలో మరో సంచలన ఘటన చోటుచేసుకుంది. విడాకులు ఇచ్చిందన్న కారణంతో ఒక వ్యక్తి తన మాజీ భార్యను కిరాతకంగా హతమార్చిన సంఘటన వనస్థలిపురం ప్రాంతంలో వెలుగులోకి వచ్చింది. గ్రీన్ సిటీ కాలనీలోని ఓ అపార్టుమెంట్‌లో ఈ దారుణం జరగడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సునీత అనే మహిళకు గతంలో మహేశ్‌తో వివాహం జరిగింది. దాంపత్య జీవితంలో మనస్పర్థలు తలెత్తడంతో ఇరువురు విడిపోయారు. ఏడాది క్రితం సునీత అధికారికంగా విడాకులు తీసుకుని, అనంతరం మరో వ్యక్తిని వివాహం చేసుకుని అదే కాలనీలో నివసిస్తోంది. ఈ విషయాన్ని జీర్ణించుకోలేక మహేశ్ ఆమెపై పగ పెంచుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మహేశ్ కత్తులు, పెట్రోల్ డబ్బాతో సునీత నివాసానికి చేరుకుని ఇంట్లోకి చొరబడ్డాడు. ఆమెపై దాడి చేసి హత్య చేశాడు. ఇంట్లోకి ఎవరైనా వస్తే పెట్రోల్ పోసి నిప్పంటిస్తానని బెదిరించడంతో అపార్టుమెంట్ వాసులు భయంతో వణికిపోయారు. ఘటన సమయంలో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

ఘటన అనంతరం పరారయ్యేందుకు ప్రయత్నించిన మహేశ్‌ను అప్రమత్తమైన స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది.

### ఐబొమ్మ నిర్వాహకుడు

# ఇమంది రవి జైలు నుంచి విడుదల

**హైదరాబాద్, 18 ఫిబ్రవరి (తెలంగాణ ముచ్చట్లు):** తెలుగు సినిమా పైరసీకి కేంద్రంగా మారిన 'ఐబొమ్మ' వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమంది రవి చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యాడు. పైరసీ కేసులో అరెస్టయిన రవికి తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన నేపథ్యంలో ఆయన విడుదలయ్యారు. తెలుగు సినిమాలను అక్రమంగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తూ పైరసీకి పాల్పడినట్లు ఆరోపణలపై సైబర్ క్రైమ్ పోలీసులు గత నవంబరులో రవిని అరెస్టు చేశారు. విదేశాల నుంచి వెబ్‌సైట్ నిర్వహిస్తూ, బెట్టింగ్ యాప్‌ల ద్వారా భారీ మొత్తంలో ఆదాయం ఆర్జించినట్లు దర్యాప్తులో బయటపడింది. ఈ చర్యల వల్ల తెలుగు చిత్ర పరిశ్రమకు గణనీయమైన ఆర్థిక నష్టం వాటిల్లినట్లు ఫిర్యాదులు నమోదయ్యాయి. అరెస్టు అనంతరం రవి పలుమార్లు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ అనుకూల నిర్ణయం రాలేదు. అనంతరం హైకోర్టును ఆశ్రయించగా, జస్టిస్ కె. సుజాన నేతృత్వంలోని ధర్మాసనం పిటిషన్‌ను విచారించి బెయిల్ మంజూరు చేసింది. తొంభై రోజులకు పైగా జైలులో ఉన్నాడు, ఇంకా చార్జ్‌షీట్ దాఖలు కాలేదనే అంశాలను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. అయితే, కోర్టు కఠిన షరతులు విధించింది. దేశం విడిచి వెళ్లరాదని, పాస్‌పోర్టును సమర్పించాలని ఆదేశించింది. ప్రతిరోజూ ఉదయం పదకొండు గంటలకు సీసీఎస్ పోలీసుల ఎదుట హాజరుకావాలని, సాక్షులను ప్రభావితం చేయవద్దని స్పష్టం చేసింది. షరతులు ఉల్లంఘిస్తే బెయిల్ రద్దు చేస్తామని హెచ్చరించింది. రవి విడుదలతో ఈ కేసు దర్యాప్తు తదుపరి దశ ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది.

### రాజ్యసభ అభ్యర్థులపై అధిష్టానం

# తుది నిర్ణయం: మహేష్ గౌడ్

**హైదరాబాద్, 18 ఫిబ్రవరి (తెలంగాణ ముచ్చట్లు):** రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై తుది నిర్ణయం అధిష్టానం తీసుకుంటుందని తెలంగాణ పిసిసి చీఫ్ మహేష్ గౌడ్ స్పష్టం చేశారు. రేపు జరిగే సమావేశంలో పార్టీ నిర్మాణం, అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి అయిన సందర్భంగా సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల్లో బీసీలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. వార్డు సభ్యుల్లో అరవై ఏడు శాతం బీసీలకే కేటాయించామని, మేయర్లు, మున్సిపల్ చైర్మన్లలో యాభై శాతం బీసీలకు అవకాశమిచ్చామని వివరించారు. రాజ్యసభ సీటు బీసీకి ఇస్తారా లేదా అన్నది పూర్తిగా అధిష్టానం నిర్ణయమని తెలిపారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి పరిస్థితిని అర్థం చేసుకోవాలని సూచించారు. సీట్లు సర్వే నివేదికల ఆధారంగా కేటాయించామని, చైర్మన్ పదవులు సభ్యుల సంఖ్యను బట్టి నిర్ణయించామని వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత పార్టీ పనితీరుపై అధిష్టానం సంతృప్తిగా ఉందని తెలిపారు. పార్టీ బలోపేతం, సామాజిక సమీకరణ లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మహేష్ గౌడ్ పేర్కొన్నారు. అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### ధరణి దోపిడిపై ఉక్కుపాదం

# కోడ్ ఆడిట్‌కు ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)

ఇది సాధారణ సాంకేతిక లోపం కాదని, వ్యవస్థాగతంగా సృష్టించిన లోపాల ఫలితమని స్పష్టం చేశారు. సెక్యూరిటీ ఆడిట్‌లో గుర్తించిన లోపాలను సరిదిద్దకుండానే నివేదిక ఇచ్చినట్టు ప్రాథమికంగా గుర్తించినట్లు వెల్లడించారు. భూముల లావాదేవీలకు సంబంధించిన అనుమానాస్పద సమాచారం లభించకుండా లాగిన్‌లను తొలగించిన అంశం, రహస్య లాగిన్ వివరాలు లేకపోవడం వంటి అంశాలు విచారణలో బయటపడ్డాయని పేర్కొన్నారు. ఫోరెన్సిక్ ఆడిట్‌లో కోడ్ ఆడిట్ నిర్వహించలేదని వెల్లడైందని, తక్షణమే ధరణి పోర్టల్‌పై కోడ్ ఆడిట్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. విదేశీ సంస్థకు నిర్వహణ బాధ్యతలు అప్పగించడం వల్లే సమస్యలు తలెత్తినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రభుత్వానికి రావాల్సిన ప్రతి పైసాను వసూలు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. తప్పుచేసిన వారెవరైనా వదిలిపెట్టబోమని హెచ్చరించారు. భూభారతి పోర్టల్‌ను ప్రజలకు అనుకూలంగా, అధికారుల ప్రమేయానికి తావులేకుండా రూపొందించాలని అధికారులకు సూచించారు. సిరిసిల్ల, సిద్ధిపేట జిల్లాల్లో నిర్వహించిన విధంగానే మిగతా జిల్లాల్లో కూడా ఫోరెన్సిక్ ఆడిట్ చేపట్టాలని ఆదేశించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





## పేద విద్యార్థికి అండగా జంగం శివ...
## ఎంబీబీఎస్ విద్యార్థికి ఆర్థిక సహాయం

**పెద్దమందడి,ఫిబ్రవరి18 (తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండల పరిధిలోని అనకాయపల్లి తండాకు చెందిన గోపాల్ నాయక్ కుమారుడు తేజ నాయక్ మెడికల్ సీటు సాధించి మెదక్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పేద కుటుంబానికి చెందిన ఈ విద్యార్థి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిన వెంటనే సామాజిక సేవకుడు జంగం శివ స్పందించారు. అనకాయపల్లి తండాకు వెళ్లిన జంగం శివ, పెద్దమందడి గ్రామ సర్పంచ్ శ్రీమతి సూర్య గంగమ్మ రవి చేతుల మీదుగా తేజ నాయక్‌కు రూ.5,000/ రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థి ఉన్నత చదువులు పూర్తి చేసి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఊషన్న, వార్డు సభ్యుడు రవి, కాంగ్రెస్ కార్యకర్త స్వామి మరియు తండావాసులు పాల్గొన్నారు. గ్రామస్తులు జంగం శివ సహృదయతను అభినందిస్తూ, ఆయన సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.



## మోజర్ల గ్రామంలో
## టీబీ ఛాతీ ఎక్స్‌రే నిర్ధారణ శిబిరం నిర్వహణ

**పెద్దమందడి,ఫిబ్రవరి18(తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండలం మోజర్ల గ్రామ పంచాయతీలో బుధవారం టీబీ ఛాతీ ఎక్స్‌రే నిర్ధారణ శిబిరాన్ని గ్రామ సర్పంచ్, వైద్య సిబ్బంది కలిసి నిర్వహించారు. గ్రామస్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.శిబిరంలో మొత్తం 85 మందికి ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. వీరిలో అనుమానిత లక్షణాలు ఉన్న 23 మందికి తేమడ (స్పుటమ్) నమూనాలను సేకరించి పరీక్షల కోసం పంపిస్తున్నట్లు వైద్య సిబ్బంది వెల్లడించారు. గ్రామస్తులు ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డా. ప్రవళిక, టీబీ సిబ్బంది, సూపర్వైజర్ రామస్వామి, ఏఎన్ఎమ్ లలిత, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, ఉప సర్పంచ్ రాయకంటి రాములు, ఆశ వర్కర్లు గిరిజా, సత్యమ్మ పాల్గొన్నారు.

## గవర్నర్ చేతుల మీదుగా 'విశిష్ట ప్రతిభా రత్న'
## అవార్డు అందుకున్న సెరినిటీ విద్యార్థులు

**నాగారం, ఫిబ్రవరి 18 (తెలంగాణ ముచ్చట్లు)**



హిందీ సేవా సదన్ మహావిద్యాలయ్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించిన నాగారం సెరినిటీ పాఠశాల విద్యార్థులు హరిక, ఆరాధ్యలకు 'విశిష్ట ప్రతిభా రత్న' అవార్డు లభించింది. ఈ పురస్కారాన్ని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అందుకోవడం పాఠశాలకు గర్వకారణమని కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి తెలిపారు.రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానం సాధించినందుకు విద్యార్థులకు రూ.2,500 నగదు బహుమతి, బంగారు పతకం, ప్రశంసా పత్రం ప్రదానం చేశారు. ఈ విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.పాఠశాల తరఫున బుధవారం విద్యార్థులను ప్రత్యేకంగా సత్కరించి అభినందించారు. భవిష్యత్తులో కూడా మరిన్ని విజయాలు సాధించి పాఠశాల పేరును రాష్ట్ర స్థాయిలో మరింత ప్రతిష్ఠాత్మకంగా నిలబెట్టాలని ఆకాంక్షించారు.



## నేరెడ్మెట్‌లో శివాజీ జయంతి వేడుకలకు
## ఎంపీ ఈటల రాజేందర్‌కు ఆహ్వానం

**మల్కాజిగిరి, ఫిబ్రవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):**

మల్కాజ్గిరి నియోజకవర్గం నేరెడ్మెట్ డివిజన్ పరిధిలోని ఆర్కేపురం ప్రాంతంలో ఆదిదేవ్ అసోసియేషన్ మరియు హిందూ వాహిని ఆధ్వర్యంలో, అలాగే డిఫెన్స్ కాలనీలో హిందూ ఏకతా యూత్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 19న నిర్వహించనున్న ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలకు హాజరుకావలసిందిగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ ను నిర్వాహకులు కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ, యువతకు శివాజీ మహారాజ్ జీవితం స్ఫూర్తిదాయకమని, ధైర్యం, దేశభక్తి, నాయకత్వ లక్షణాలకు ఆయన ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు.వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్కే శ్రీను, మహిపాల్ రెడ్డి, కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఆదిత్య, రమేష్ గౌడ్, శ్యామ్, ఆకారం సాయి, సాయి ప్రవేశ్, మహేష్, బాబీ తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి సందర్భంగా చాందిని క్రికెట్ టోర్నమెంట్ ఘన ముగింపు

**మల్లాపూర్, ఫిబ్రవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):**




మహాశివరాత్రి పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని పరమేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన చాందిని క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. మల్లాపూర్ డివిజన్ ఎన్టీఆర్ నగర్ బండ భావి కమ్యూనిటీ హాల్‌లో జరిగిన బహుమతి ప్రదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ నాయకుడు నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ యువతను క్రీడల వైపు మళ్లించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రమశిక్షణ, ఐక్యత పెంపొందుతాయని అన్నారు. క్రీడలు యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని, ఇటువంటి టోర్నమెంట్లు సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన జట్టుకు రూ.25,000 నగదు బహుమతిని అందజేశారు. రన్నర్‌గా నిలిచిన కుషాయిగూడ బాయ్స్ జట్టుకు రూ.15,000 ప్రైజ్ మనీని అందించి క్రీడాకారులను అభినందించారు.ఈ కార్యక్రమంలో కోయలకొండ రాజేష్, నాగి ముదిరాజ్, శివ ముదిరాజ్, రాజు ముదిరాజ్, బాబ్లు, సందీప్, వంశీ తదితరులు పాల్గొన్నారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంలో నెమలి అనిల్ కుమార్ ప్రోత్సాహం ఆదర్శప్రాయమని నిర్వాహకులు పేర్కొన్నారు.

# చర్చి కాలనీలో చకచకా అభివృద్ధి పనులు ప్రారంభం

- రూ.2.27 కోట్లతో మౌలిక సదుపాయాల మెరుగుదల

**ఉప్పల్, ఫిబ్రవరి 18 ( తెలంగాణ ముచ్చట్లు):**





ఉప్పల్ డివిజన్ పరిధిలోని చర్చి కాలనీలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మొత్తం రూ.2 కోట్ల 27 లక్షల వ్యయంతో కాలనీలో మౌలిక వసతుల మెరుగుదలకు చర్యలు చేపట్టారు.కాలనీలో కలుషిత మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రూ.1 కోటి 9 లక్షలతో కొత్త వాటర్ పైప్ లైన్ మరియు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పైప్‌లైన్ పనులు పూర్తయిన వెంటనే రూ.1 కోటి 18 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు నాయకులు తెలిపారు.ఈ పనులను ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మందుముల రజితా పరమేశ్వర్ రెడ్డి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పనుల నాణ్యతలో ఎటువంటి రాజీ లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.చర్చి కాలనీలో వాటర్ లైన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను రూ.2.27 కోట్లతో చేపట్టినట్లు వారు తెలిపారు. అతి త్వరలోనే ఈ పనులు పూర్తై ప్రజలకు మెరుగైన వసతులు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యుఎస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రజనీకాంత్ రెడ్డి, చర్చి కాలనీ అధ్యక్షులు జానీ, సుధాకర్, లుకాస్, రత్న రెడ్డి, డేవిడ్, ప్రవీణ్, సతీష్, సునీల్, రోసి మేరి, కార్తీక్, పుష్పాలమ్మ, ఫ్రాన్సిస్, బాలస్వామి, సల్ల ప్రభాకర్ రెడ్డి, సందీప్, భాస్కర్, రాఘవేంద్ర, వల్లపు శ్రీకాంత్ యాదవ్, సాగ శ్రీధర్, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కీసరగుట్టలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా ముగిశాయి

**కీసరగుట్ట, ఫిబ్రవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):**



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర డివిజన్ 1 పరిధిలోని కీసరగుట్ట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి దేవస్థానం లో నిర్వహించిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శ్రద్ధాభక్తులతో పూర్ణాహుతితో విజయవంతంగా ముగిశాయి.బ్రహ్మోత్సవాలు మొదటి రోజున గణపతి పూజతో ప్రారంభమై, చివరి రోజున క్షేత్ర దిగ్బలి, వేద ఆశీర్వచనాలతో శాంతియుతంగా సమాప్తమయ్యాయి. వైదిక కార్యక్రమాలను వేద పండితులు గణపతి శర్మ ఆధ్వర్యంలో వేదపాఠశాల విద్యార్థులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఉత్సవాల విజయవంతమైన నిర్వహణకు సహకరించిన అధికారులకు, పోలీసు సిబ్బందికి, ట్రస్టు సభ్యులకు, మాజీ చైర్మన్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ తటాకం వెంకటేష్ శర్మ, ఈఓ కట్ట సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా 5వ రోజున వసంతోత్సవం, పుష్పయాగం వంటి వైదిక కార్యక్రమాలు కూడా ఘనంగా నిర్వహించబడ్డాయి. ప్రధాన పూజారులు ఈ కార్యక్రమాలకు నేతృత్వం వహించారు.మహాశివరాత్రి సందర్భంగా భారీగా తరలివచ్చిన భక్తులతో కీసరగుట్ట ఆధ్యాత్మిక క్షేత్రం భక్తి పరవశంతో మార్మోగింది. ప్రతి సంవత్సరం ఇక్కడ ఘనంగా ఉత్సవాలు నిర్వహించడం ద్వారా భక్తులను ఆకర్షించే సంప్రదాయం కొనసాగుతోంది.

# అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

**కాజీపేట్ ఫిబ్రవరి 18 (తెలంగాణ ముచ్చట్లు)**




ప్రతి ఒక్కరూ డాక్టర్ బి.ఆర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనకు చేయాలని 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగ్ అన్నారు. కాజీపేట్ బాపుజీ నగర్ పోచమ్మ గుడి ఆవరణలో తేజోమయి మాల కుల సంఘం అధ్యక్షుడు మర్యాల కృష్ణ, ప్రధాన కార్యదర్శి బండి విజయ్ కుమార్ అధ్యక్షతన నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. అనంతరం సంకు నర్సింగ్ మాట్లాడుతూ సంఘ సభ్యులందరూ ఒక్క తాటిపై ఉండి సంఘ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో కోశాధికారి పప్పుల గోవర్ధన్, కొండ్ర నర్సింగ్ రావు, తండమల్ల వేణు, సిహెచ్ కొమ్మాలు, బండి రామచందర్, బత్తుల సమ్మయ్య, బొబ్బిలి నాగరాజు, బొట్టు రాజు, బరాబరి ఉప్పల్ రావు, బాదం కుమార్ స్వామి, మద్దెల కార్తీక్, భద్రయ్య, నీరటి సాయిరాజ్, మర్యాల ప్రవీణ్, బోయిని వెంకట్రావు, బొబ్బిలి రాజేందర్, పోతరాజు రాజేశ్వరరావు, బరాబరి శ్రీకాంత్, రామ్ వెంకట్ రాజలింగం, కంకణాల సురేందర్ ,శ్యామ్ రావు ,జాన పట్ల యాదగిరి, పరుష బల రామ్, గొర్రె ఈశ్వర్, గడ్డం బాబు, దార్ల వెంకటేశ్వర్లు ,చలమల్ల రాజ్ కుమార్, గట్టపల్లి రాజన్ బాబు, కాలమాల మహేందర్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆలిండియా ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి జన్మదిన వేడుకలు

**వనపర్తి,ఫిబ్రవరి18(తెలంగాణ ముచ్చట్లు):**

ఆలిండియా ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మాజీ మంత్రివర్యులు సంజీవరెడ్డి జన్మదిన వేడుకలు హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని జీఎస్టీ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నరసింహా రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేందర్ రెడ్డి, రాష్ట్ర జనరల్ సెక్రటరీ గోదా మల్లేష్ గౌడ్, రాష్ట్ర సెక్రటరీ దయ్యాల దాసు, ఖమ్మం జిల్లా అధ్యక్షులు పాల్వంచ కృష్ణ, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు సంజీవరెడ్డిని ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.కార్మికుల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు.








## మణిగిల్ల ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు అల్పాహారం

**పెద్దమందడి,ఫిబ్రవరి18(తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పరీక్షల నేపథ్యంలో 10వ తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన స్టడీ అవర్స్‌లో భాగంగా సాయంత్రం అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ నూతన సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్ , ఉపాధ్యాయులు జానయ్య, ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు సాయంత్రం అల్పాహారం అందజేశారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు చదువుపై మరింత దృష్టి సారించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్‌తో పాటు గ్రామ పెద్దలు రాంరెడ్డి, ఎం. బుచ్చన్న, వెంకటయ్య, శ్రీకాంత్ రెడ్డి, ఉప్పూరి సాయికుమార్ పాల్గొన్నారు.విద్యార్థులు, గ్రామస్తులు కార్యక్రమాన్ని అభినందించారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : చొల్లేటి రాజేష్
తెలుగు దిన పత్రిక

## ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలో దొంగల బీభత్సం

**ఎల్కతుర్తి, ఫిబ్రవరి 18(తెలంగాణ ముచ్చట్లు):**

మండల కేంద్రంలోని దామెర గ్రామంలో మధ్యాహ్నం సమయంలో దొంగలు బీభత్సం సృష్టించారు. గ్రామానికి చెందిన ఆవుల సంపత్ ఇంట్లో మధ్యాహ్నం రెండు గంటల సమయంలో దొంగతనం జరిగినట్లు సమాచారం.

బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం, కుటుంబ సభ్యులు వ్యవసాయ పనుల నిమిత్తం బయలుదేరి వెళ్లగా, తిరిగి ఇంటికి వచ్చేసరికి తలుపు తెరిచి ఉండడం గమనించారు. అనుమానంతో ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువా తాళం పగలగొట్టి, అందులోని వస్తువులు చిందరవందరగా పడివున్నట్లు గుర్తించారు.

ఇంట్లో ఉంచిన నగదు రూ.2 లక్షలు, ఎనిమిది తులాల బంగారం, 40 తులాల వెండి ఆభరణాలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. వెంటనే వందకు డయల్ చేయగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు.

సీఐ పులి రమేష్, ఎస్సై ప్రవీణ్ కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం డాగ్ స్క్వాడ్ సహాయంతో ఇంటి పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు.

బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సీఐ పులి రమేష్ తెలిపారు.

## సిఆర్పీల ఆత్మీయ సమ్మేళనానికి పిలుపు.!

◆ **ఈ నెల 22న హైదరాబాద్‌లో సభ.**

**దమ్మపేట, ఫిబ్రవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):**

సీఆర్పీ యూనియన్ తెలంగాణ ఆధ్వర్యంలో సిఆర్పీల ఆత్మీయ సమ్మేళనం అనంతరం నిర్వహించనున్న ఏఐటీయూసీ పరిచయ-అభినందన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్రంలోని సిఆర్పీలందరికీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాద్య నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని తెలిపారు. ఈ నెల 22న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని మినర్వా హోటల్ సమీపంలోని ముగ్దుం భవన్‌లో కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొత్తగూడెం ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యేలు పల్లా వెంకట్‌రెడ్డి, చాడా వెంకటరెడ్డి తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. అలాగే ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు




కలవేణ శంకర్, ఎస్.బాలరాజు, ఎం.నరసింహ, కడారి సునీల్ పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థలో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న సిఆర్పీల సమస్యల పరిష్కారం కోసం ఒక వేదికగా ఈ సమ్మేళనం కీలకమని తెలిపారు. ఏఐటీయూసీ అనుబంధ సంఘంగా ముందుకు సాగుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లందరూ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని రాష్ట్ర కమిటీ తరపున కోరారు.



## ఉపాధ్యాయుడిగా సుదీర్ఘ సేవలందించిన భగవంతుకు ఘన వీడ్కోలు

**పెద్దమందడి,ఫిబ్రవరి18 (తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండలం మోజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుదీర్ఘ కాలంగా సేవలందించిన ఉపాధ్యాయుడు భగవంత్ పదవి విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం ఆనందోత్సాహాలతో కళకళలాడింది. కార్యక్రమానికి డీఈవో, ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై భగవంత్ సేవలను కొనియాడారు. ఆయన బోధనా విధానం, క్రమశిక్షణ, విద్యార్థుల పట్ల చూపిన ఆప్యాయత పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిందని వక్తలు పేర్కొన్నారు.ఈ సందర్భంగా పదవి విరమణ పొందిన భగవంత్ భావోద్వేగంగా మాట్లాడుతూ.. ఈ పాఠశాల నా కుటుంబం లాంటిది. ఇక్కడ గడిపిన ప్రతి క్షణం నాకు అమూల్యం.సహచర ఉపాధ్యాయుల సహకారం, గ్రామస్తుల ప్రోత్సాహం వల్లనే నేను నా బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించగలిగాను. నా విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరి సమాజానికి ఆదర్శంగా నిలవాలి. అదే నాకు నిజమైన బహుమతి, అని అన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో సభను మరింత ఆకట్టుకున్నారు. అనంతరం జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని, మండల విద్యాధికారి మంజుల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వరప్రసాదరావు తదితరులు కలిసి భగవంత్‌ను శాలువాతో సత్కరించి స్మారక చిహ్నం అందజేశారు.గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమం స్మరణీయంగా నిలిచింది.కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# పదవి విరమణ తర్వాత శేష జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేయాలి

**-- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**పెద్దమందడి,ఫిబ్రవరి18(తెలంగాణ ముచ్చట్లు):**

పదవి విరమణ ప్రతి ఉద్యోగి జీవితంలో సహజమని, అనంతరం శేష జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేసి సమాజానికి తోడ్పాటు అందించే విధంగా ముందుకు సాగాలని తూడి మేఘారెడ్డి సూచించారు.బుధవారం మద్దిగట్ల ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (సాంఘిక శాస్త్రం)గా సేవలందించిన అశ్విని భగవంతు పదవి విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు.సమాజంలో గురువులకు ప్రత్యేక స్థానం ఉందని, సమాజ మార్పుకు గురువుల బోధనలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. అలాంటి గురువులు పదవి విరమణ అనంతరం కూడా సమాజోద్ధరణలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఉద్యోగ జీవితం ముగిసిన తర్వాత కూడా తమ సేవలతో మంచి గుర్తింపు నిలుపుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా పదవి విరమణ పొందుతున్న అశ్విని భగవంతు, రాధా దంపతులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## నైన్ ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలో ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహణ

**నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):**

మల్కాజ్గిరి నియోజకవర్గం నేరేడ్‌మెట్‌లోని నైన్ ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలో విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని బుధవారం ఫైర్ మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులు ఎలా స్పందించాలి అనే అంశంపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు.ఈ మాక్ డ్రిల్‌కు అల్ట్రా టెక్ సిమెంట్ సంస్థకు చెందిన మాజీ సైనికుడు, రిటైర్డ్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ కెవిఎస్ కెవిఎన్. రెడ్డి నాయకత్వం వహించారు. ఆయన విద్యార్థులకు అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భవనం నుండి సురక్షితంగా బయటకు వచ్చే విధానం, అత్యవసర నిష్క్రమణ మార్గాల ప్రాముఖ్యత, ఫైర్ ఎక్విప్‌మెంట్ వినియోగంపై ప్రాక్టికల్‌గా వివరించారు.డ్రిల్ క్రమశిక్షణ, సమయస్ఫూర్తి, ఆత్మస్థైర్యం అత్యవసర పరిస్థితుల్లో ఎంత ముఖ్యమో తెలియజేశారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో భద్రతా అవగాహన పెంపొందించడంతో పాటు, ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచుతాయని



కళాశాల వైస్ ప్రెసిడెంట్ కీర్తి కన్నే, బ్రాంచ్ డైరెక్టర్ నడిమింటి విహారి పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తూ విద్యార్థుల రక్షణకు కట్టుబడి ఉంటామని కళాశాల యాజమాన్యం వెల్లడించింది.

# ఖిల్లా ఘనపూర్లో పలు శుభకార్యాలకు హాజరైన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**ఖిల్లా ఘనపూర్,ఫిబ్రవరి18(తెలంగాణ ముచ్చట్లు):**

ఖిల్లా ఘనపూర్ మండలంలోని వెనుక తండాకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు కృష్ణ నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరై శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కృష్ణ కుమారుడు, కుమార్తెల పుట్టు చీర, పుట్టు పంచె కార్యక్రమాలలో పాల్గొని చిన్నారులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులకు శుభాభినందనలు తెలియజేశారు.మాజీ మంత్రి వెంట స్థానిక సర్పంచులు రుక్మిణి రాజు, కవితా భరత్, మాజీ ఎంపీపీ కృష్ణ నాయక్, మండల పార్టీ అధ్యక్షులు రాళ్ల కృష్ణయ్య, మన్నెం గౌడ్, డి. సురేందర్, చెరక గోపాల్, పోలిశెట్టి ప్రతాప్, గోపాల్ నాయక్, తిరుపతి నాయక్, శంకర్, మున్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# వికలాంగుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటాం

◆ **ఎమ్మెల్యే కొమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

**హైదరాబాద్ , ఫిబ్రవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో మునుగోడు ఎమ్మెల్యే కొమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. మునుగోడు నియోజకవర్గంలో నివసిస్తున్న వికలాంగుల ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని, ఎమ్మెల్యే తల్లి పేరుతో నడుస్తున్న ఫౌండేషన్ ద్వారా ప్రత్యేక హెల్త్ క్యాంపులు నిర్వహించాలని కోరారు.ముఖ్యంగా స్పైనల్ కార్డ్ మరియు మస్కులర్ వికలాంగులతో బాధపడుతున్న వారికి ప్రతి నెలా అవసరమైన మందులు, సహాయక పరికరాలు మరియు అవసరమైన వస్తుసామాగ్రి అందించాలనే అభ్యర్థనను వ్యక్తం చేశారు.అదేవిధంగా, నియోజకవర్గం లోని వికలాంగుల కోసం ప్రత్యేకంగా "వికలాంగుల భవనం" నిర్మించాలని సమితి ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, వికలాంగుల సంక్షేమం కోసం తన వంతు సహకారం అందిస్తూ భవిష్యత్తులో తప్పక చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పబ్బు రాజు, టీవీహెచ్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కిరణ్ గుత్తికొండ, రాష్ట్ర కార్యదర్శి మెరుగు శివకృష్ణ, మహిళా నాయకురాలు యశోద గోద, కొడిదల నరేష్ తదితరులు పాల్గొన్నారు.






# ప్రభుత్వ పాఠశాలలే నాణ్యమైన విద్యకు కేంద్రబిందువు

◆ **మాజీ మంత్రి గుండె విజయరామారావు**

**హన్మకొండ,ఫిబ్రవరి18(తెలంగాణ ముచ్చట్లు):**

ప్రభుత్వ పాఠశాలలే నాణ్యమైన విద్యకు కేంద్రబిందువు అని మాజీ మంత్రి,బిజెపి నేత గుండె విజయరామారావు అన్నారు.

బుధవారం ధర్మసాగర్ మండలంలోని పలు గ్రామాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి గుండె విజయరామారావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ఉచితంగా 300 సైకిళ్లు మరియు విద్యా సామగ్రిని అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు బోధిస్తున్నందున నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉపాధ్యాయులు నిర్దేశించే లక్ష్యాలను స్పష్టంగా అర్థం చేసుకుని తమ జ్ఞానాన్ని విస్తరించుకోవాలని సూచించారు. విద్యతోనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, పట్టుదలతో సాధన చేస్తే భవిష్యత్తు వెలుగొందుతుందని అన్నారు.

ప్రతిరోజూ సైకిల్‌పై పాఠశాలకు వెళ్లడం వల్ల విద్యార్థులకు శారీరక వ్యాయామం కలిగి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు మేధో వికాసానికి కూడా దోహదం చేస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో తంకశాల అశోక్, విశ్రాంత ప్రొఫెసర్ వెంకటనారాయణ,డాక్టర్ శ్వేత, డాక్టర్ రాహుల్, డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ కిరణ్ రెడ్డి, మండలంలోని వివిధ గ్రామాల తల్లిదండ్రులు, విద్యార్థులు,వివిధ గ్రామాల నాయకులు,తాటికాయల గ్రామ శాఖ అధ్యక్షులు పెసరు వెంకటేష్,ఉపాధ్యక్షులు నలుబాల కుమార్ యూత్,అధ్యక్షులు కొండబోయిన మహేష్‌సీనియర్ నాయకులు వల్లాల అనిల్ సల్ల శివకృష్ణ నలుబాల సర్వేశ్వర్ చొక్కం రాజు పెసరు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

గురువారం- 19 - ఫిబ్రవరి 2026



# మల్కాజిగిరిలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా పునఃసమీక్షపై సమీక్షా సమావేశం

మల్కాజ్గిరి, ఫిబ్రవరి 18 (తెలంగాణ ముచ్చట్లు)




మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా పునఃసమీక్ష (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గౌరవనీయులైన జోనల్ కమిషనర్ అధ్యక్షత వహించారు.సమావేశంలో ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ), సహాయ ఎన్నికల నమోదు అధికారులు (ఏరోలు), బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓ సూపర్‌వైజర్లు) మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. సార్ ప్రక్రియలో చేపట్టాల్సిన కార్యాచరణ, ఇంటింటి తనిఖీలు, ఓటర్ల వివరాల ఖచ్చితత్వం, అర్హులైన ప్రతి పౌరుడిని ఓటర్ల జాబితాలో చేర్చడం, అనర్హుల తొలగింపు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. జోనల్ కమిషనర్ మాట్లాడుతూ, సార్ ప్రక్రియను పూర్తిస్థాయిలో పారదర్శకంగా, సమర్థవంతంగా మరియు నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. బిఎల్ఓలు ఫీల్డ్ స్థాయిలో ప్రజలతో సమన్వయం కలిగి జాగ్రత్తగా పనిచేసి ఓటర్ల జాబితా నాణ్యతను మెరుగుపరచాలని సూచించారు. ప్రజలు ఈ ప్రత్యేక సమగ్ర పునఃసమీక్ష కార్యక్రమానికి సహకరించి, తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని అవసరమైన సవరణలు చేయించుకోవాలని అధికారులు కోరారు.

---

# గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి..

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి -18(తెలంగాణ ముచ్చట్లు)






గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ ఈజీఎస్, సెర్ప్, గ్రామ పంచాయతీ కార్యకలాపాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.

అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ ప్రతి నెల గ్రామంలో పారిశుద్ధ్యం , త్రాగునీటి సరఫరా అనుసరిస్తున్న విధానాలపై సమావేశాలు నిర్వహిస్తూ మినిట్స్ కాపీలను ఆన్ లైన్ లో అప్ లోడ్ చేయాలని తెలిపారు. ఫిబ్రవరి 20 వరకు గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటి సరఫరాపై నిర్వహిస్తున్న ప్రత్యేక డ్రైవ్ లో గుర్తించిన అంశాలను 4 వారాలలో పరిష్కరించి వేసవి కాలంలో త్రాగునీటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

రఘునాథపాలెం, తిరుమలాయపాలెం మండలంలో తక్కువగా ఉపాధి హామీ పనులు జరిగాయని, మండలాల్లో ఉపాధి హామీ పనుల క్రింద మంజూరు చేసిన అభివృద్ధి పనులు క్షేత్ర స్థాయిలో పూర్తి చేసేందుకు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని, చేసిన పనుల వివరాలను రికార్డులలో నమోదు చేసి సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని అదనపు కలెక్టర్ సూచించారు.

ఎంపిడిఓ, ఎంపిఓ, ఏఈ పిఆర్ ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి మండలంలో ఉపాధి హామీ క్రింద క్షేత్ర స్థాయిలో పనులు ప్రారంభం కాని పనులు క్లోజ్ చేయాలని, పురోగతిలో ఉన్న పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. సోషల్ ఆడిట్ కు సమాంతరంగా ఉపాధి హామీ పనులు కూడా జరిగేలా చూడాలని, ఆడిట్ పేరుతో పనుల్లో వేగం తగ్గవద్దని అన్నారు. మహిళలను స్వశక్తి మహిళా సంఘాలలో భాగస్వామ్యం చేసేందుకు నూతన ఎస్.హెచ్.జి. లను ఏర్పాటు చేయాలని, కొత్త ఎస్.హెచ్.జి. లకు అవగాహన కార్యక్రమాలు కల్పించాలని అన్నారు. గ్రామ సమాఖ్య, మండల సమాఖ్యలకు సొంత భవనాల నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ సూచించారు. గ్రామ సమాఖ్య, మండల సమాఖ్య భవనాల నిర్మాణం కోసం కేటాయించే స్థలాలు వివాద రహితంగా ఉండాలని అన్నారు.

నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు పంపిణీ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఎన్.పి.ఏ గ్రూప్ నుంచి డబ్బు రికవరిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. రుణాల రికవరి సీరియస్ గా పరిగణించాలని, మహిళా సంఘాలను రెగ్యులర్ ఫాలో అప్ చేస్తూ తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ రుణాలు చెల్లింపు చేసేలా చూడాలని అన్నారు.

గ్రామాలలో పన్నులు వసూళ్ల పై దృష్టి సారించి ప్రతి గ్రామంలో నిర్దేశిత లక్ష్యం ప్రకారం వంద శాతం పన్ను వసూలు చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. పంచాయతీలకు వచ్చే గ్రాంట్ నిధులను పకడ్బందీగా ఖర్చు చేయాలని, ఎక్కడ కూడా ఎటువంటి అవకతవకలు జరగడానికి వీలు లేదని అన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ కె. శ్రీరామ్, డిపిఓ రాంబాబు, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, డివిజనల్ పంచాయతీ అధికారిణి విజయలక్ష్మి, ఎంపీడీవోలు, మండల పంచాయతీ అధికారులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

---

# సీఎం కప్ ఖో-ఖోలో ప్రథమ స్థానం.. కాకరవాయి జడ్పీ హైస్కూల్ విద్యార్థుల ఘన విజయం

- అభినందించిన ప్రధానోపాధ్యాయులు నల్లగుంట్ల మధుసూదన్ రావ్.

ఖమ్మం బ్యూరో,ఫిబ్రవరి 18(తెలంగాణ ముచ్చట్లు)



తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడారంగంలో తమ ప్రతిభను చాటుతూ మరోసారి పాఠశాలకు కీర్తి తెచ్చారు. ఫిబ్రవరి 9, 10 తేదీలలో ఖమ్మం జిల్లాలోని కుసుమంచి గ్రామంలో నిర్వహించిన సీఎం కప్ ఖోఖో క్రీడా పోటీలలో పాల్గొన్న విద్యార్థులు అద్భుత ప్రదర్శనతో ప్రథమ స్థానం సాధించి జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నల్లగుంట్ల మధుసూదన్ రావు విజేత విద్యార్థులను అభినందించి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం ద్వారా విద్యార్థులు సమగ్ర అభివృద్ధిని సాధిస్తారు. క్రమశిక్షణ, కఠిన సాధన ఉంటే గ్రామీణ విద్యార్థులు కూడా ఉన్నత స్థాయిలను అందుకోవచ్చన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లోనూ మన విద్యార్థులు సత్తా చాటాలని ఆయన ఆకాంక్షించారు.ఈ విజయంతో పాఠశాలలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు విజేతలను అభినందిస్తూ వారి భవిష్యత్తు విజయాలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్ రావ్ పి డి సైదులు,

---

# విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం ..

- మేడ శంకరయ్య.. సుశీలమ్మ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం.
- విప్పలమడక అభివృద్ధికి తోడ్పాటును అందిస్తా ..
- వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కట్ల సంతోష్

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 18 (తెలంగాణ ముచ్చట్లు)



విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ అన్నారు. వైరా మండలంలోని విప్పలమడక గ్రామంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మేడా శంకరయ్య సుశీలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం సుమారు రూ. 15 వేల విలువచేసే షూలు, సాక్సులు, బెల్టు, టైలూ, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు, న్యూ లిటిల్ ఫ్లవర్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పోతినేని భూమేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు వాటిని అంద చేశారు. అనంతరం కట్ల సంతోష్ మాట్లాడుతూ విప్పలమడక గ్రామానికి తమ కుటుంబానికి 30 ఏళ్లగా అవినాభావ సంబంధం ఉందని చెప్పారు. తమ వ్యాపార కార్యకలాపాలకు విప్పలమడక గ్రామం కీలకంగా ఉండేదని పేర్కొన్నారు. మేడా శంకరయ్య సుశీలమ్మ చారిటబుల్ ట్రస్ట్ సేవలో ప్రశంసనీయమని కొనియాడారు. విప్పలమడక గ్రామాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని స్పష్టం చేశారు. గత సర్పంచ్ ఎన్నికల్లో మంచి పాలకవర్గాన్ని ఎన్నుకోవడంతోనే విప్పలమడక గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రెండు నెలల కాలంలోనే మేడా శంకరయ్య సుశీలమ్మ చారిటబుల్ ట్రస్ట్ విప్పలమడక గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సామాజిక సంస్థలు ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. న్యూ లిటిల్ ఫ్లవర్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పోతినేని భువనేశ్వరరావు మాట్లాడుతూ మేడా శంకరయ్య సుశీలమ్మ చారిటబుల్ ట్రస్ట్ స్ఫూర్తితో తన తల్లి పేరుతో పోతినేని సరోజని చారిటబుల్ ట్రస్ట్ ను ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ నూతన ట్రస్ట్ ఆధ్వర్యంలో విప్పలమాడక గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ బూర్గులూర్థమ్మ, మాజీ సర్పంచులు పారుపల్లి కృష్ణారావు, తుమ్మల జాన్ పాపయ్య, మాజీ ఎంపీటీసీ ఆకుల ప్రసాద్, గ్రామ కార్యదర్శి కాంపల్లి ధనమ్మ, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుడు దొంతెబోయిన సత్యనారాయణ, వార్డు సభ్యులు ముత్తమాల నాగజ్యోతి, పారుపల్లి నిఖిత, గరిడేపల్లి శ్రీనివాసరావు, కాశీమాల సామేలు, బూర్గునందిని తదితరులు పాల్గొన్నారు.

---



# ఉపాధ్యాయునిగా భగవంత్ సేవలు విద్యా రంగానికి ఆదర్శం -జర్నలిస్టుల అభినందనలు

పెద్దమందడి,ఫిబ్రవరి18(తెలంగాణ ముచ్చట్లు):

పెద్దమందడి మండలం మద్దిగట్ల మోజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవి విరమణ పొందిన ఉపాధ్యాయుడు భగవంత్‌కు నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో స్థానిక జర్నలిస్టులు పాల్గొని ఆయన సేవలను కొనియాడారు.జర్నలిస్టులు మాట్లాడుతూ.. భగవంత్ సుదీర్ఘకాలం పాటు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు.క్రమశిక్షణ, నిబద్ధత, విద్యార్థుల పట్ల ఉన్న అంకితభావం ఆయనను ఆదర్శ ఉపాధ్యాయుడిగా నిలబెట్టాయని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతంలో విద్యా ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ఆయన చేసిన కృషి అభినందనీయమని తెలిపారు.ఈ సందర్భంగా జర్నలిస్టులు భగవంత్‌ను శాలువాతో సన్మానించి, విద్యా రంగానికి ఆయన అందించిన సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు వెంకట్ గౌడ్, శివ చారి, బండి రాజు, రామ్ నరేష్ యాదవ్, మన్నెం, కృష్ణ యాదవ్, మహేష్, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

---



# ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీకి ఎంపీ ఈటల రాజేందర్ సన్మానం

ఉప్పల్, ఫిబ్రవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):

ఉప్పల్ ప్రెస్ క్లబ్ (ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా కమిటీ) నూతన కమిటీ సభ్యులను మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఘనంగా సన్మానించారు. అధ్యక్షుడు వద్దేపల్లి కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ సభ్యులకు శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, 35 సంవత్సరాల తర్వాత ఉప్పల్‌లో సీనియర్ జర్నలిస్టు వద్దేపల్లి కిషోర్ నాయకత్వంలో ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కలిసి ప్రెస్ క్లబ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఐకమత్యం, స్నేహబంధంతో నూతన కమిటీ సమర్థవంతంగా పని చేసి మీడియా గౌరవాన్ని మరింత పెంచాలని ఆకాంక్షించారు.మీడియా నిష్పక్షపాత ధోరణితో పనిచేస్తూ ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని, అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో ముందుండాలని సూచించారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ చేపట్టే సేవా కార్యక్రమాలకు తన సంపూర్ణ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ బీజేపీ అధ్యక్షుడు మారినేని ఫణిందర్, ప్రధాన కార్యదర్శి తీగ విట్టల్ రావు, కోశాధికారి దువ్వాళ రమేష్, ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

---



# శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఘనంగా నిర్వహణ

నాగారం, ఫిబ్రవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):

శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను స్థానికంగా అత్యంత ఘనంగా, భక్తి-భావాలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున హాజరై మహారాజ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ మహోత్సవానికి నాగారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, బోర్వెల్ కుషాయిగూడ జోన్ అధ్యక్షులు కందడి శ్రీనివాస్ రెడ్డి, రెడ్యా నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ యూత్ అధ్యక్షులు భద్రు నాయక్, సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ధీరావత్ హనుమంతు నాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉత్సవ కమిటీ నాయకులు, బంజారా సోదరులు-సోదరీమణులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు, అధికారులు, ఉద్యోగులు, శాస్త్రవేత్తలు, యూనియన్ నాయకులు మరియు పలు సంఘాల ప్రతినిధులు ఉత్సాహంగా హాజరై కార్యక్రమాన్ని మరింత వైభవంగా తీర్చిదిద్దారు.ఈ సందర్భంగా ప్రసంగించిన నాయకులు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆధ్యాత్మిక సందేశాలను స్మరించుకున్నారు. సమాజంలో ఐక్యత, సేవా భావం, సామాజిక సౌభ్రాతృత్వం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన చూపిన మార్గంలో నడుచుకుంటూ బంజారా సమాజ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. జయంతి వేడుకలు భక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానంతో భక్తిశ్రద్ధల మధ్య విజయవంతంగా ముగిశాయి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# గ్రామీణ స్వరానికి అంతర్జాతీయ గుర్తింపు..


- **చెన్నై వేదికపై డా. పత్తిపాటి లక్ష్మీకాంతమ్మకు ఇంటర్నేషనల్ ఐకాన్ అవార్డు**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 18 (తెలంగాణ ముచ్చట్లు)**

ఖమ్మం జిల్లా చింతకాని మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకురాలు, జానపద కళాకారిణి, బుర్రకథ గాయనీ డాక్టర్ పత్తిపాటి లక్ష్మీకాంతమ్మ అంతర్జాతీయ వేదికపై అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. సమాజంలో నెలకొన్న పలు సమస్యలపై తన పాట, మాటల ద్వారా చైతన్యం నింపుతున్న ఆమెకు ఇంటర్నేషనల్ ఐకాన్ అవార్డు ప్రదానం చేయడం జిల్లా ప్రజలకు గర్వకారణంగా నిలిచింది.అమెరికన్ యూనివర్సిటీ ఫ్రెస్ మరియు వరల్డ్ పీస్ ఎన్ వై ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఫిబ్రవరి 17, 2026న టీ నగర్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమెకు ఈ ప్రతిష్టాత్మక పురస్కారం అందజేశారు. జానపద కళారూపమైన బుర్రకథను సాధనగా చేసుకుని బాల్యవివాహాలు, మద్యపానం నియంత్రణ, మహిళా సాధికారత, కుటుంబ సంక్షేమం వంటి అంశాలపై లక్ష్మీకాంతమ్మ విస్తృత ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు పొదుపు సంఘాలు ఏర్పాటు చేసి, స్వయం ఉపాధి మార్గాలు చూపుతూ కుటుంబాల్లో ఆర్థిక స్థిరత్వం తీసుకువచ్చే కృషి చేస్తున్నారు.ఇప్పటికే పలు సంస్థల నుంచి దాదాపు 30కు పైగా అవార్డులు అందుకున్న ఆమెకు తాజాగా లభించిన ఈ అంతర్జాతీయ పురస్కారం సేవా ప్రయాణానికి మరింత ప్రతిష్టను తీసుకొచ్చింది.

ఈ సందర్భంగా లక్ష్మీకాంతమ్మ మాట్లాడుతూ, "ప్రతి అవార్డు నాకు మరింత బాధ్యతను గుర్తుచేస్తుంది. సమాజంలో మార్పు కోసం ఇంకా కృషి చేస్తూ ప్రజా సేవలో ముందుండేందుకు కట్టుబడి ఉన్నాను" అని తెలిపారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ మధుకిషన్ హాజరై అభినందనలు తెలిపారు. ప్రత్యేక అతిథిగా డాక్టర్ చి. ఉషా కిరణ్ రాయ్ పాల్గొన్నారు. గౌరవ అతిథులుగా కొందూరు హరినారాయణ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్‌కు చెందిన కె. హరినారాయణ రెడ్డి, తమిళనాడు ఆర్మరీ, చెన్నైకు చెందిన ఎల్.ఎన్. పి.కె. సత్యనారాయణ, ఏయూజీపీ కర్ణాటక చాప్టర్ పీస్ అంబాసడర్ బిషప్ సత్యమూర్తి, ఏపీ జనపద సంక్షేమ సంఘం చైర్మన్ డాక్టర్ మిరియాల వెంకట రమణయ్య హాజరయ్యారు. కార్యక్రమ నిర్వహణను చెన్నై చాప్టర్ పీస్ అంబాసడర్ స్టెల్లా నిర్వహించారు.వివిధ రాష్ట్రాల నుంచి సామాజిక సేవకులు, కళాకారులు, కవులు హాజరై లక్ష్మీకాంతమ్మను ఘనంగా సత్కరించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన మహిళ అంతర్జాతీయ వేదికపై సత్కారం పొందడం ఖమ్మం జిల్లావాసుల్లో ఆనందం, గర్వం నింపింది.




# మీ బీఎస్ఎన్ఎల్ నంబర్ నిలిచిపోయిందా? తక్కువ ఖర్చుతో 90 రోజుల సౌకర్యం

ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేస్తున్న టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ వినియోగదారులకు ఊరటనిచ్చే కొత్త సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. చాలా కాలంగా ఉపయోగించని కారణంగా నిలిచిపోయిన మొబైల్ సంఖ్యలను మళ్లీ వినియోగంలోకి తీసుకురావడానికి తక్కువ ఖర్చుతో దీర్ఘకాల చెల్లుబాటు కలిగిన పథకాన్ని ప్రవేశపెట్టింది. ముఖ్యంగా రెండో సిమ్‌గా ఉపయోగించే వినియోగదారులకు ఇది ఉపయోగకరంగా మారనుంది.

ఈ పథకం ద్వారా మూడు నెలల పాటు సంఖ్యను చురుకుగా ఉంచుకునే అవకాశం ఉంటుంది. ఒకేసారి ఎక్కువ మొత్తాన్ని ఖర్చు చేయకుండా, రోజుకు చాలా తక్కువ వ్యయంతో సేవలను కొనసాగించవచ్చు. ఎక్కువగా మాట్లాడటానికి కాకుండా అవసరమైన సందర్భాల్లో మాత్రమే ఉపయోగించే వారికి ఇది అనుకూలంగా ఉంటుంది.

ఈ పథకంలో దేశవ్యాప్తంగా ఎక్కడి నుంచైనా అదనపు చార్జీలు లేకుండా మాట్లాడే సౌకర్యం కల్పించారు. అలాగే ప్రతి రోజు నిర్దిష్ట సంఖ్యలో సందేశాలను పంపుకునే అవకాశం కూడా ఉంటుంది. అంతర్జాల వినియోగానికి పరిమిత పరిమాణాన్ని మొత్తం చెల్లుబాటు కాలంలో ఎప్పుడైనా ఉపయోగించుకోవచ్చు. రోజువారీ పరిమితి లేకపోవడం వల్ల అవసరానికి అనుగుణంగా వినియోగించుకోవచ్చు.

ఇటీవల కాలంలో సంస్థ దేశవ్యాప్తంగా సేవల మెరుగుదలకు చర్యలు చేపడుతోంది. కొత్త ప్రసార స్థంభాలను ఏర్పాటు చేస్తూ సేవల విస్తరణపై దృష్టి పెట్టింది. భవిష్యత్తులో మరింత వేగవంతమైన కొత్త తరహా సేవలను అందించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని సంస్థ వర్గాలు పేర్కొంటున్నాయి. సేవల నాణ్యత పెంపు కోసం కేంద్ర ప్రభుత్వం కూడా ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు సమాచారం.

పాత సంఖ్యను వదులుకోవద్దనుకునే వారు, తక్కువ ఖర్చుతో దీర్ఘకాలం ఉపయోగించాలనుకునే వారు ఈ పథకాన్ని ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. పెరుగుతున్న పోటీ నేపథ్యంలో వినియోగదారులను ఆకర్షించేందుకు ఇతర టెలికాం సంస్థలు కూడా ఇలాంటి దీర్ఘకాల పథకాలను ప్రవేశపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో తక్కువ ధరతో అందుబాటులోకి వచ్చిన ఈ సదుపాయం వినియోగదారుల దృష్టిని ఆకర్షిస్తోంది.

# భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి..

- **జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ఖమ్మం బ్యూరో,ఫిబ్రవరి- 18(తెలంగాణ ముచ్చట్లు)**






నేషనల్ హైవే ప్రాజెక్ట్ ల పూర్తికి సంబంధించి భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి నేషనల్ హైవే ప్రాజెక్ట్ పురోగతిపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, ధాంసలాపురం ఎంట్రీ, ఎక్జిట్ భూ సేకరణ పూర్తి చేయాలన్నారు. 1.38 ఎకరాల భూసేకరణ కు ప్రక్రియ పూర్తి చేసి, భూమి అప్పగించాలన్నారు. అదనపు భూసేకరణ కు సంబంధించి ప్రిలిమినరీ నోటిఫికేషన్ పబ్లిష్ చేసినట్లు, పిడి ప్రక్రియ ప్రాసెస్ లో ఉన్నట్లు తెలిపారు. మార్చి 15కల్లా పనులు పూర్తయ్యేలా కార్యాచరణ చేయాలన్నారు. నాగపూర్అమరావతి నేషనల్ హైవే ఖమ్మంవిజయవాడ ప్యాకేజి1కు సంబంధించి కొనిజర్ల మండలం గోపతి, బోనకల్ మండలం చిన్నబీరవేల్లి గ్రామాల్లో భూమి స్వాధీనానికి చర్యలు చేపట్టాలన్నారు. ఖమ్మంవిజయవాడ ప్యాకేజి2 కు సంబంధించి మధిర, ఎర్రుపాలెం లలో మిషన్ భగీరథ, అటవీశాఖ లతో స్ట్రక్చర్ ల వాల్యుయేషన్ పూర్తి చేసినట్లు, ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలన్నారు. ఎర్రుపాలెం మండలం ఎర్రుపాలెం గ్రామం, మధిర మండలం నిదానపురం గ్రామాల్లో భూ స్వాధీనానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. కేబుల్ బ్రిడ్జ్ భూసేకరణ కు సంబంధించి అవార్డ్ మొత్తాన్ని డిపాజిట్ చేయాలని అన్నారు. వీధివ్యాపారులకు వెండర్ జోన్ ఏర్పాటుచేయాలని కలెక్టర్ అన్నారు. రోడ్డు భద్రత క్రింద గుర్తించిన జంక్షన్లలో చేపట్టిన భద్రతా చర్యలు నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. పనులకు ముందు, పనుల పూర్తి తర్వాత డాక్యుమెంట్ చేసి సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, నేషనల్ హైవే పిడి దివ్య, తహశీల్దార్లు సైదులు, రమాదేవి, అరుణ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంత పేదల కంటి వెలుగు...

- **నేడు ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి 15వ వార్షికోత్సవం 15 ఏళ్లలో 28వేల ఉచిత కంటి ఆపరేషన్లు..**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 18 (తెలంగాణ ముచ్చట్లు)**





రాష్ట్రంలో ఏ ఒక్కరు కూడా కంటి సమస్యతో ఇబ్బంది పడవద్దు అనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఎల్. వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ, నవభారత్ నేత్ర వైద్య కేంద్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రామీణ ప్రాంత ప్రజలకు కంటి వెలుగుగా నిలిచింది పాల్వంచలో నవ భారత్ సహకారంతో నవ నగర్ లో 2011 ఫిబ్రవరి 19న ఈ సంస్థను నెలకొల్పారు అప్పటినుంచి ఇప్పటివరకు ఈ సంస్థ ఆధ్వర్యంలో 5.40 లక్షల మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించగా 56వేల మందికి పైగా శాస్త్ర చికిత్సలు నిర్వహించారు వారిలో 27,728 మందికి ఉచితంగా శాస్త్ర చికిత్స చేసి మానవత్వాన్ని చాటుకున్నారు అనునిత్యం 215 మందికి పైగా జిల్లా నుంచి కాకుండా పొరుగు జిల్లాల నుంచి కంటి వ్యాధి గ్రహస్తులు ఈ ఆస్పత్రికి వచ్చి కంటి పరీక్షలు నిర్వహించుకుంటున్నారు ఆర్థిక స్తోమత లేకుండా నిరుపేదలైన వారికి పైసా ఖర్చు లేకుండా ఉచితంగా కంటి పరీక్షలు చేసి వారికి చూపు ప్రసాదించడం వీరి లక్ష్యం.

ఆస్పత్రిలో అధునాతనమైన సుమారు కోటి విలువగల ఎక్యూమెంట్ తో కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు.

హైదరాబాద్ వంటి నగరాలతో సమానంగా కంటి పరీక్షలో నిర్వహించి శాస్త్ర చికిత్సలు చేయడంతో విశేష ఆదరణ పొందింది. సంపన్నుల నుంచి సామాన్యుల వరకు ఇక్కడే కంటి వైద్య చికిత్స పొందుతున్నారు. ఈ కేంద్రానికి అనుసంధానంగా జిల్లా వ్యాప్తంగా 10 సబ్ సెంటర్లను (సుజాత నగర్, జూలూరుపాడు, తల్లాడ , కల్లూరు, టేకులపల్లి, ఎల్లందు, చంద్రుగుండ, మణుగూరు, ఆశ్వాపురం, & చర్ల) ఏర్పాటు చేసి మారుమూల గ్రామాలకు సైతం సేవలను విస్తృత పరుస్తున్నారు.

**నిరుపేదలకు ఉచిత వైద్యం**

దేవిచందర్ రావు అడ్మినిస్ట్రేటివ్ అధికారి మాట్లాడుతూ* భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎల్ వి ప్రసాద్ వైద్యశాల నిర్మించడం ఇక్కడ ఉన్న ప్రజలకు ఒక వరం లాంటిది.

కంటి చూపు తగ్గి రుగ్మలతో ఇబ్బంది పడుతున్న నిరుపేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు ఎల్.వి . ప్రసాద్ కంటి ఆసుపత్రి ద్వారా నిర్వహిస్తున్నామని వారికి సైతం కార్పొరేట్ స్థాయిలో తక్కువ ఖర్చుతో అన్ని రకాల కంటి పరీక్షలు అందజేస్తున్నామన్నారు.

# రమజాన్ మాసం వరాల వసంతం

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 18 (తెలంగాణ ముచ్చట్లు)**

పవిత్ర రమజాన్ అత్యంత శుభప్రదమైన మాసం శుభాల సిరులు వర్షించే వరాల వసంతం. ఈ మాసంలోనే పవిత్ర అంతిము దివ్య ఖుర్ఆన్ అవతరించింది. ఇది సమస్త మానవాళికి మార్గదర్శిని. ఈ మాసంలోనే రోజా వ్రతం విధిగా నిర్ణయించబడింది. వేయి మాసాల కన్నా విలువైన రాత్రి అని చెప్పబడిన 'లైలతుల్ ఖద్ర్' ఉంది. ఈ మాసంలో చేసే ఒక్క సత్కార్యానికి అనేక రెట్లు అధికంగా పుణ్యఫలం లభిస్తుంది. ఒక విధిని ఆచరిస్తే డెబ్బై విధులు ఆచరించిన దానితో సమానమైన పుణ్యం లభిస్తుంది. సమాజంలో మంచి మార్పు కనిపిస్తుంది. 'ఫిత్రా' ఆదేశాలు కూడా ఈ మాసంలోనే అవతరించాయి. ఫిత్రా అన్నది పేదసాదల హక్కు, ఫిత్రాల వల్ల వారికి ఆర్థికంగా కాస్త ఊరట లభిస్తుంది. జకాత్ కూడా ఈ మాసంలోనే చెల్లిస్తారు. ఇది కూడా పేదసాదల ఆర్థిక అవసరాలు తీర్చడంలో గణనీయంగా తోడ్పడుతుంది. 'తరావీహ్' నమాజులు కూడా ఈ మాసంలోనే ఆచరించబడ తాయి. అదనపు పుణ్యాలు మూటగట్టుకోవడానికి ఇదొక సువర్ణావకాశం. ఈ పవిత్ర మాసంలో ఎవరైతే ధర్మనిష్టతో ఆత్మ పరిశీలనతో పరలోక ప్రతిఫలాపేక్షతో రమజాన్ రోజాలు పాటిస్తారో వారు గతంలో చేసిన పాపాలను అల్లాహ్ మన్నిస్తాడు. సహనం వహించవలసిన నెల రమజాన్,

రమజాన్ మాసం సహనం, నిగ్రహం పాటించవలసిన నెల, సహనానికి ప్రతిఫలం స్వర్గం. ఇది సమాజంలోని ఉపేక్షితుల పట్ల, బాధితుల పట్ల సానుభూతిని చూపించాల్సిన నెల. శారీరక సాధనాలు, ఆరాధనలు, ఉపవాసనలు, గ్రంథ పారాయణాలు మనిషి అంతర్యంలో పరివర్తన తెస్తాయి. మనిషి ఆలోచనా తీరు మారుతుంది. ఉన్నత ప్రమాణాలు అలవడతాయి. ఫలితంగా మనిషి ప్రవర్తనలలో నైతికత, మంచితనం, ప్రశాంతత, నిష్టా గరిష్టత, సదాచారం చోటుచేసుకుంటాయి.



మనిషి ఆధ్యాత్మికతకు, సర్వతోముఖాభివృద్ధికి, మనోవికాసానికి రమజాన్ దారి చూపిస్తుంది. ఇది విశ్వప్రభువు సందేశమైన దివ్య ఖుర్ఆన్ ను మానవాళికి ఈ మాసంలోనే అం దిం చిం ది . ఈ అంతిను దివ్య ఖుర్ఆన్ ఆవతరం సాధారణ విషయం కాదు. అజ్ఞానాంధకారంలో మగ్గుతున్న ఆనాటి అరబ్బులను విజ్ఞాన పథంలోకి మార్చి, వారిని విద్యా పోషకులుగా, క్రమశిక్షణా దురం ధరులుగా సంస్కారవంతులుగా చేసింది. బాధితులు, అణగారిన వారి కోసం, పోరాడే వారిగా మనుమల్ని తీర్చిదిద్దింది. పవిత్ర ఖుర్ఆన్ అవసరార్థుల కోసం, ప్రేరణాత్మక, విప్లవాత్మకమైన జీవన విధానాన్ని, నిరాడంబరమైన నైతిక జీవితాన్ని ప్రపంచానికి అందించింది.

**సౌమ్ అంటే ఉపవాసం**

ఉపవాసాన్ని అరబీ భాషలో 'సౌమ్' అంటారు. దీని అర్థం 'ఆగి పోవడం', 'నియంత్రించుకోవడం'. ఈ నెలలో ఆహారపదార్థాలను కొంచెం దూరంగా ఉండటమే కాదు. తమను తాము చెడు నుంచి కూడా దూరంగా ఉంటారు.

**ఫిత్రా నిరుపేదల హక్కు**

ఫిత్రా దానం పేదల పాలిట పెన్నిది. వారు పండుగ పూట పస్తు లుండకుండా అందరితో పాటు వారు కూడా సంతోషంగా పండుగ పూట గడిపేందుకు దైవం దీన్ని విధిగా చేశాడు. ఫిత్రా దానం వల్ల మూడు ప్రయోజనాలు కలుగుతాయి. ఒకటి విశ్వాసి మాత్రం ఫిత్రా చెల్లించి తన ఆనందాన్ని ప్రకటిస్తూ అల్లాహ్ కు కృతజ్ఞతలు తెలుపుకుంటాడు. రెండు, ఉపవాసస్థితిలో జరిగిన పొరపాట్లు ఫిత్రా చెల్లించడం వల్ల దూరమవుతాయి, మూడు, ఇది నిరుపేదల ఇళ్ళల్లో సంతోషాన్ని, ఆనందాన్ని నింపుతుంది. వారు సంతోషంగా పండుగ జరుపుకునేందుకు ఉపయోగపడుతుంది.

**అసమానతలను తొలగించే సాధనం జకాత్**

జకాత్ అన్న పదం 'జకీ' నుంచి వచ్చింది. జక అంటే అర్థం పెరుగుట, ఎదుగుట, వృద్ధి చెందుట, అభివృద్ధి, వ్యాపించుటం మొదలైనవి. జకాత్ అంటే ప్రతి ధనవంతుడు తన ధనం నుండి కొంత ధనాన్ని అవసరమైన వారికి ఇవ్వడం. నిర్ణీత సమయంలో, నిర్ణీత ధనంనుండి నిర్ణీత ప్రజల కొరకు ఇచ్చే ధనమే జకాత్

**తరావీహ్ నమాజ్**

రమజాన్ నెలలోని తరావీహ్ నమాజు పుణ్యం రీత్యా ఎంతో ఘనమయిన నమాజు. దాన్ని నెరవేర్చమని హదీసుల్లో తాకీదు చేయబడింది. అయినప్పటికీ అది నఫిల్ నమాజు మాత్రమే. ఈ నఫిల్ నమాజును రమజాన్ నమాజుగా పేర్కొనటం జరిగింది. కాని తర్వాతి కాలంలో ఇది 'తరావీహ్ నమాజ్'గా నామాంతరం జరిగింది. తరావీహ్ అనేది తర్వీహ్ అనే పదానికి బహు వచనం. తరావీహ్ అంటే విశ్రాంతి, విరామం అని అర్థం. మహాప్రవక్త(స) అనుచరులు ఆయన సంప్రదాయానుసారం చాలాసేపు నిలబడి నమాజు చేసేవారు. ఆ విధంగా నాలుగు రకాతుల తరువాత కాసేపు విశ్రాంతి తీసుకునేవారు. ఎవరయితే ధర్మనిష్టతో ఆత్మ పరిశీలనతో పరలోక ప్రతిఫలా పేక్షతో తరావీహ్ నమాజ్ చేస్తాడో అతడు పూర్వం చేసిన అపరా ధాలను అల్లాహ్ క్షమిస్తాడు. (ముత్తఫకున్ అలైహి)

దైవప్రవక్త(స)రమజాన్ మాసం చివరి పది రోజులు ఏతెకాఫ్ చేసే వారని అబ్దుల్లా బిన్ ఉమర్(ర) తెలిపారు. (బుఖారీ, ముస్లిమ్)

హజ్రత్ ఆయిషా (రజి) ఇలా ఉల్లేఖించారు: దైవ సందేశహరులు (స) రమజాన్ చివరి పది రోజులు రాగానే రాత్రిళ్ళు ఇతోధికంగా జాగరణ చేసి దైవారాధనలో గడిపేవారు. తన సతీమణుల్ని కూడా మేల్కొలిపేవారు. అధికోత్సహంతో దైవారాధనలో నిమగ్నులయ్యే వారు.

ఫిబ్రవరి 19 (గురువారం ) నుండి రంజాన్ మాసం ఆరంభం

-అబ్దుల్ మలిక్ (ఖమ్మం )

# నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

**కీసర, ఫిబ్రవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):**

ఫీడర్లలో కీసర సబ్‌స్టేషన్ నిర్వహణ పనులు చేపట్టనున్నందున కీసర పరిధిలోని పలు ప్రాంతాల్లో తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కీసర విద్యుత్ శాఖ ఏఈఎస్. మురళీ కృష్ణ తెలిపారు.

రాంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు 11 కె.వి శ్రీనగర్ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది.

ఈ సమయంలో రాంపల్లి ఇండస్ట్రియల్ ఏరియా, చెర్లపల్లి నుండి రాంపల్లి రోడ్ వరకు, సాయి నగర్ కాలనీ, జ్యోతి కాలనీ, డీఎస్ఆర్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.అలాగే యాద్గార్పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 02:00 గంటల నుండి సాయంత్రం 05:00 గంటల వరకు 11 కె.వి యాద్గార్పల్లి ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ఈ సమయంలో యాద్గార్పల్లి గ్రామం, చితారమ్మ ఆలయం, టింబర్ డిపో, ఎస్సీ కాలనీ, రామస్వామి కాలనీ, యాద్గార్పల్లి ఏజీఎల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.అత్యవసర అవసరాల కోసం ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ శాఖ పనులకు సహకరించాలని ఏఈ ఎస్. మురళీ కృష్ణ విజ్ఞప్తి చేశారు.




# ఘనంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం

**ధర్మసాగర్,ఫిబ్రవరీ18(తెలంగాణ ముచ్చట్లు):** ధర్మసాగర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ధర్మసాగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. శ్రీధర్ రావు అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు వలన మనిషికి విలువ పెరుగుతుందని, విలువలతో జీవితాన్ని కొనసాగించడమే సార్థకమని అన్నారు. సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో దాని ప్రభావాలు కూడా పెరుగుతున్నాయని, విద్యార్థులు సాంకేతికతను సద్వినియోగం చేసుకుని మానవ వికాసానికి దోహదపడాలని సూచించారు. సమాజానికి ఆదర్శంగా నిలిచేలా విద్యార్థులు తమ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆస్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ విద్యాసంస్థను కడియం శ్రీహరి స్థాపించగా, ఇప్పటివరకు సుమారు 3500 మంది విద్యార్థులకు విద్య అందించిందని తెలిపారు. వందలాది మంది విద్యార్థులు వివిధ రంగాల్లో ఉద్యోగాలు సాధించారని వివరించారు. ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరిగి ఉమ్మడి జిల్లా స్థాయిలో అగ్రస్థానంలో నిలిచినట్లు చెప్పారు. సృజనాత్మక, క్రీడా పోటీలలో కూడా కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానాలు సాధించినట్లు పేర్కొన్నారు. ఇంటర్ విద్య అనంతరం ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలపై మార్గదర్శనం, శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతి మాట్లాడుతూ కళాశాలలో క్రీడా మైదానం, గ్రంథాలయం ఏర్పాటు కోసం కృషి చేస్తానని తెలిపారు. వివిధ పోటీల్లో విజేతలకు అతిథుల చేత బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు, గీతాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పెద్ద పెండ్యాల సర్పంచ్ నాగరాజు, అధ్యాపకులు మంజుల, అజం, బాబూరావు, రాములు, గణేష్, గోపాలకృష్ణ, సదానందం, ప్రభాకర్, రాజేందర్, రవళి, వేణు, యాకూబ్ ఆలీ, చంద్రమౌళి, శేఖర్ తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# భూరికార్డుల ప్రక్షాళన భూమి ఉన్న ప్రతి ఒక్కరికీ మేలు

**మీడియా అకాడమీ వర్క్‌షాప్‌లో కోదండరెడ్డి.**

**సత్తుపల్లి, ఫిబ్రవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):** భూరికార్డుల ప్రక్షాళన కార్యక్రమం భూమి ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపయోగపడుతుందని తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎమ్. కోదండరెడ్డి అన్నారు. హైదరాబాద్, నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ ఆడిటోరియంలో భూ హక్కులు, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ అంశాలపై నిర్వహించిన ఒకరోజు వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవసాయం, రైతు సంక్షేమం రాష్ట్ర అభివృద్ధికి కీలకమని, రైతుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని తెలిపారు. రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధిగమించడమే లక్ష్యంగా విజన్-2047 దిశగా ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు. భూ హక్కుల పరిరక్షణలో భాగంగా 'భూ భారతి' పథకం ద్వారా భూములను గుర్తించి రైతులకు హక్కులు, పత్రాలు అందజేస్తున్నట్లు వివరించారు. అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ భూ ఆధారిత అంశాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఈ వర్క్‌షాప్ నిర్వహించామని చెప్పారు. శిక్షణలో భూ చట్టాలు, సమస్యల పరిష్కారం అంశంపై రైతు కమిషన్ సభ్యుడు భూమి సునిల్, వ్యవసాయం-అనుబంధ రంగాల్లో ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలపై నాబార్డ్ మాజీ సీజీఎం మోహనయ్య, పర్యావరణ భద్రతపై శాస్త్రవేత్త బి.వి. సుబ్బారావు, జర్నలిస్టుల నైతిక నియమావళి, మీడియా చట్టాలపై కే. శ్రీనివాస్ రెడ్డి అవగాహన కల్పించారు. డిజిటల్ రిపోర్టింగ్‌లో వ్యవసాయం, రైతు సమస్యలపై సీనియర్ జర్నలిస్ట్ కలమండ శరత్, గ్రామీణ-రెవెన్యూ అంశాలపై రాందాస్ ప్రవీణ్ వివరించారు. శిక్షణలో పాల్గొన్న విలేకరులకు అకాడమీ తరఫున సర్టిఫికెట్లు, పుస్తకాలు అందజేశారు. వర్క్‌షాప్ సమన్వయకర్తగా కరుణాకర్ దేశాయి వ్యవహరించారు. కార్యక్రమంలో అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




# రాజోలి తిరుణాల రథోత్సవంలో భక్తుల రద్దీ!

**జోగులాంబ గద్వాల, ఫిబ్రవరి18(తెలంగాణముచట్లు):** జోగులాంబ గద్వాల జిల్లాలోని రాజోలి మండల కేంద్రంలో వెలసిన శ్రీశ్రీశ్రీ అడివేశ్వరస్వామి సన్నిధిలో శివపార్వతుల కళ్యాణ రథోత్సవం వైభవంగా నిర్వహించబడింది. తిరుణాల సందర్భంగా భక్తుల రద్దీ భారీగా నెలకొంది. ఉదయం నుంచే మండల కేంద్రానికి చేరుకున్న భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. రథోత్సవ కార్యక్రమానికి గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు హాజరై శివపార్వతుల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, అనంతరం రథోత్సవాన్ని ఘనంగా ప్రారంభించారు. రథం వీధుల గుండా ప్రదక్షిణగా సాగుతుండగా భక్తులు హర్షధ్వానాలతో స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో సంధ్య శ్రీరామ్ రెడ్డి, యూత్ నాయకుడు రాజ్ కిరణ్ కుమార్ రెడ్డి, రాజోలి సర్పంచ్ గంగిరెడ్డి లక్ష్మీనారాయణ రెడ్డి, వార్డు సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు. తిరుణాల సందర్భంగా మండల కేంద్రం భక్తజన సందోహంతో కళకళలాడింది.

## ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి...

# అయినప్పటికీ లాభాల్లో ముగిసిన మార్కెట్లు

ఐటీ రంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగినప్పటికీ దేశీయ షేర్ మార్కెట్లు బుధవారం లాభాలతో ముగిశాయి. బ్యాంకింగ్, మెటల్, ఎఫ్ఎంసీజీ రంగాల షేర్లలో వెల్లువెత్తిన కొనుగోళ్లు మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 283 పాయింట్లు పెరిగి 83,734 వద్ద ముగియగా, నిఫ్టీ 93 పాయింట్లు లాభపడి 25,819 వద్ద స్థిరపడింది. నిఫ్టీ వరుసగా మూడో రోజు లాభాల్లో ముగియడం విశేషం. రంగాల వారీగా చూస్తే ఐటీ సూచీలో పడిపోవడం స్పష్టంగా కనిపించింది. అయితే ఎఫ్ఎంసీజీ, మెటల్, పీఎస్‌యూ బ్యాంక్ రంగాలు బలంగా రాణించాయి. ఈ రంగాల్లో కొనుగోళ్లు పెరగడంతో మొత్తం మార్కెట్‌పై సానుకూల ప్రభావం పడింది. విస్తృత మార్కెట్లలో కూడా ఇదే ధోరణి కొనసాగింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు స్వల్ప లాభాలను నమోదు చేశాయి. ఉదయం సెషన్‌లో నష్టాల్లోకి జారుకున్న మార్కెట్లు మధ్యాహ్నం తర్వాత పుంజుకున్నాయి. సెన్సెక్స్ తన కనిష్ట స్థాయి నుంచి గణనీయంగా కోలుకుని బలమైన ముగింపును నమోదు చేసింది. దేశీయ సంస్థాగత మదుపరుల నుంచి కొనసాగుతున్న పెట్టుబడులు మార్కెట్లకు ప్రధాన బలం అందిస్తున్నాయని మార్కెట్ విశ్లేషకులు తెలిపారు. దేశీయ ఆర్థిక వృద్ధిపై ఉన్న ఆశావహ దృక్పథం పెట్టుబడిదారుల నమ్మకాన్ని పెంచుతోందని వారు పేర్కొన్నారు. మరోవైపు డాలర్‌తో పోలిస్తే రూపాయి స్వల్పంగా బలహీనపడింది. మారకం విలువ రెండు పైసలు తగ్గి 90.66 వద్ద కొనసాగింది. బీఎస్ఈలో ఎక్కువ సంఖ్యలో షేర్లు లాభాల్లో ముగియడం మార్కెట్‌లో సానుకూల ధోరణిని సూచిస్తోంది.

# నిశీధిలో నిశ్చలంగా నిశ్శబ్దం రాసాను..



**బసడ సంపత్ యాదవ్**

రాత్రి కళ్లకు తలుపులు మూసుకున్న వేళ
మనసు ఆకాశానికి కిటికీ తెరుస్తుంది.
అక్కడ
నిజాలు విరామం తీసుకుంటాయి,
అబద్ధాలు కూడా సిగ్గుతో నిద్రపోతాయి.

కల...
కాలానికి అద్దం పట్టే మౌన కవి,
గాయాల మీద రంగులు చల్లే చిత్రకారుడు.

నిన్నటి బాధలను
చంద్రకాంతితో కడిగి,
రేపటి ఆశలకు
నక్షత్రాల అక్షరాలు నేర్పుతుంది.

రాత్రి...
చీకటి వెనుక దాగిన వేడుక,
వెన్నెలలో మునిగిన ప్రేమ గీతం,
సముద్రపు అలలతో కలిసిన మనసు,
ప్రతి మూలలో మౌనపు కథలు చెబుతుంది.

మనకు లేని లోకాన్ని చూపించి,
మనలో దాగిన లోకాన్ని గుర్తుచేస్తుంది.
కనిపించి మాయమయ్యే ఈ మిథ్యా రాజ్యం,
నిద్ర అనే గర్భంలో పుట్టి
జాగృతి అనే వెలుగులో చనిపోతుంది.

అయినా...
మనిషి బతికే ధైర్యం
ఎప్పుడూ కలల నుంచే మొదలవుతుంది,
సముద్రపు వెన్నెలలో
ప్రేమ మౌన నృత్యంతో ప్రవహిస్తూ
మనసులోని అంతరిక్షపు వెలుగు
హృదయంలో నిశ్శబ్దంగా మెరుస్తుంది...

# మళ్లీ తగ్గిన బంగారం ధరలు..




బంగారం కొనుగోలు చేయాలని భావిస్తున్న వారికి మరోసారి ఊరట లభించింది. వరుసగా రెండో రోజు కూడా పసిడి ధరలు తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పడిపోవడంతో దేశీయ మార్కెట్‌పై కూడా ప్రభావం పడింది. దీంతో హైదరాబాద్ నగరంలో బంగారం ధరలు గణనీయంగా తగ్గాయి.


అంతర్జాతీయంగా బంగారం ధరలు తగ్గడం, డాలర్ బలపడటం, లాభాల స్వీకరణ పెరగడం వంటి కారణాల వల్ల పసిడి ధరలు దిగివచ్చినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అలాగే అమెరికా వడ్డీ రేట్లపై అంచనాల్లో వచ్చిన మార్పులు కూడా బంగారం ధరలపై ప్రభావం చూపుతున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్‌లో 22 క్యారెట్ల బంగారం ధర తులానికి సుమారు రూ. 2,050 వరకు తగ్గి రూ. 1,41,350 వద్ద కొనసాగుతోంది. 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 1,54,200 వద్ద ఉంది. వెండి ధర మాత్రం పెద్దగా మార్పులు లేకుండా కిలోకు సుమారు రూ. 2.65 లక్షల వద్ద స్థిరంగా కొనసాగుతోంది.

వివాహాల సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ధరలు తగ్గడం కొనుగోలుదారులకు అనుకూలంగా మారిందని వ్యాపారులు చెబుతున్నారు. అయితే అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులపై ఆధారపడి రాబోయే రోజుల్లో ధరల్లో మార్పులు ఉండే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

# బ్లింకిట్‌పై కేసు నమోదు?.. కారణమేంటి

ప్రముఖ త్వరిత సరఫరా సంస్థ బ్లింకిట్ పై కేసు నమోదు కావడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ సంస్థ ద్వారా కొనుగోలు చేసిన కత్తులు రెండు వేర్వేరు హత్య కేసుల్లో ఉపయోగించబడ్డాయన్న ఆరోపణల నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు చర్యలు చేపట్టారు. కేవలం ఆన్‌లైన్ వేదికగా వస్తువులు సరఫరా చేసిన సంస్థపై కూడా కేసు నమోదు చేయవచ్చా అనే అంశంపై ఇప్పుడు చర్చ కొనసాగుతోంది. పోలీసుల సమాచారం ప్రకారం ఆయుధ చట్ట నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణలతో కేసు నమోదు చేశారు. నిబంధనల ప్రకారం నిర్దిష్ట పరిమాణం కంటే ఎక్కువ పొడవు, వెడల్పు కలిగిన బ్లేడ్‌లను విక్రయించరాదు. అయితే హత్య కేసుల్లో ఉపయోగించిన కత్తులు నిర్ణయించిన పరిమితిని మించాయని విచారణలో తేలినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సంబంధిత నిబంధనలు పాటించకుండా విక్రయాలు జరిగాయన్న అనుమానంతో చర్యలు తీసుకున్నారు. ఈ కేసు తరువాత అధికారులు బ్లింకిట్‌కు చెందిన కొన్ని గోదాములు, నిల్వ కేంద్రాలపై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 55 కంటే ఎక్కువ కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఆన్‌లైన్ వేదికల ద్వారా విక్రయించే వస్తువులపై నియంత్రణలు ఎంతవరకు ఉండాలి, విక్రేత బాధ్యత ఎంతవరకు అన్న అంశాలపై న్యాయ నిపుణులు, వ్యాపార వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇటీవలి కాలంలో ఆన్‌లైన్ కొనుగోళ్లు పెరుగుతున్న నేపథ్యంలో భద్రతా నిబంధనలు కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని అధికారులు సూచిస్తున్నారు. విచారణ పూర్తయ్యే వరకు ఈ వ్యవహారం మరింత ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక




## 'స్పిరిట్' చిత్రం ఫోటోపై చర్చ..
# ప్రభాస్ రూపం చుట్టూ ఆసక్తి

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస భారీ చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఒకవైపు 'ఫౌజీ' చిత్రీకరణలో పాల్గొంటూనే, మరోవైపు 'స్పిరిట్', 'కల్కి 2' చిత్రాల కోసం సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభాస్‌కు సంబంధించిన ఒక ఫోటో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం కావడంతో సినీ వర్గాల్లో చర్చ మొదలైంది. అద్దం ముందు నిలబడి సిగార్ వెలిగిస్తున్న శైలిలో కనిపిస్తున్న ఆ ఫోటోను అభిమానులు 'స్పిరిట్' చిత్రంలోని దృశ్యమని చెబుతూ పంచుకుంటున్నారు. అయితే ఆ ఫోటో నిజంగా చిత్రీకరణ సమయంలో తీసినదా లేక కృత్రిమ మేధస్సు సహాయంతో రూపొందించబడిందా అన్నది స్పష్టంగా తెలియడం లేదు. చిత్ర బృందం నుంచి ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి వివరణ రాకపోవడంతో ఆసక్తి మరింత పెరిగింది. ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నది సందీప్ రెడ్డి వంగా. కథానాయికగా త్రిప్తి దిమ్రి నటిస్తుండగా, ప్రముఖ నటులు వివేక్ ఒబెరాయ్, ప్రకాశ్ రాజ్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్ శక్తివంతమైన పోలీసు అధికారిగా కనిపించనున్నారని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

ఫోటో అసలుదా కాదా అన్నది పక్కనపెడితే ప్రభాస్ రూపం మాత్రం అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. అధికారిక సమాచారం కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




## షూటింగ్‌కంటే ముందే సంచలనం..
# 'ఏఏ23'కు అరుదైన ఘనత

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ కలయికలో రూపొందుతున్న భారీ చిత్రం AA23 షూటింగ్ ప్రారంభం కాకముందే సంచలనం సృష్టిస్తోంది. అధికారికంగా విడుదలైన చిన్న పరిచయ దృశ్యం ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేకెత్తించగా, సినిమా గురించి దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది.

ఈ చిత్రానికి సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ రూపొందించిన థీమ్ సంగీతం సామాజిక మాధ్యమాల్లో విశేష ఆదరణ పొందుతోంది. ఈ సంగీతాన్ని ఆధారంగా చేసుకుని లక్షల సంఖ్యలో చిన్న వీడియోలు రూపొందినట్లు చిత్రబృందం వెల్లడించింది. సినిమా షూటింగ్ ప్రారంభం కాకముందే ఈ స్థాయిలో ప్రజాదరణ రావడం అరుదైన విషయం అని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఒక సినిమా పరిచయ సంగీతం ఇంత విస్తృతంగా వ్యాపించడం ఆ చిత్రంపై ఉన్న అంచనాలకు నిదర్శనంగా భావిస్తున్నారు.

అల్లు అర్జున్ గత చిత్రాల విజయాలతో దేశవ్యాప్తంగా ప్రత్యేక స్థానం సంపాదించగా, లోకేష్ కనగరాజ్ తన ప్రత్యేక శైలి కథనం, యాక్షన్ మేళవింపుతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ఈ ఇద్దరి కలయికలో సినిమా వస్తుండటంతో మొదటి ప్రకటన నుంచే అభిమానుల్లో ఉత్సాహం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో విడుదలైన పరిచయ దృశ్యం, థీమ్ సంగీతం కలిసి సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి.

ఈ అరుదైన ఘనత సాధించిన సందర్భంగా అల్లు అర్జున్, లోకేష్ కనగరాజ్ కలిసి దిగిన చిత్రం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా పంచబడుతోంది. అభిమానులు ఈ చిత్రాన్ని ఇప్పటికే భారీ విజయంగా భావిస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ ప్రధాన చిత్రం షూటింగ్ ఈ సంవత్సరంలో ప్రారంభం కానుంది. కథ, ఇతర నటీనటులు, విడుదల తేదీ వంటి వివరాలు ఇంకా ప్రకటించాల్సి ఉన్నప్పటికీ, ప్రారంభ దశలోనే ఈ స్థాయిలో స్పందన రావడం చిత్ర బృందానికి ఉత్సాహాన్ని కలిగిస్తోంది.

షూటింగ్‌కు ముందే రికార్డుల దిశగా దూసుకెళ్తున్న ఈ చిత్రం విడుదల సమయానికి మరెన్ని సంచలనాలు సృష్టిస్తుందో అనే ఆసక్తి సినీ వర్గాల్లో నెలకొంది. ప్రస్తుతం టాలీవుడ్‌లో ఈ ప్రాజెక్ట్ ప్రధాన చర్చగా మారింది.



## మరో ఇంటెన్స్ రోల్‌లో
# అనుపమ పరమేశ్వరన్

టాలీవుడ్ క్యూట్ సెన్సేషన్, పాన్ ఇండియా నటి అనుపమ పరమేశ్వరన్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు ప్రత్యేకమైన అప్‌డేట్ అందింది. ఆమె ప్రధాన పాత్రలో ఒక మానసిక ఉత్కంఠభరిత కథతో తెరకెక్కనున్న కొత్త చిత్రాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రకటనతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ఎస్ కే గీ ఎంటర్టైన్మెంట్, బెంచ్‌మార్క్ స్టోరీటెల్లర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి దర్శకుడు ఆర్జే షాన్ దర్శకత్వం వహించనున్నారు. గతంలో అనుపమ, షాన్ కలయికలో వచ్చిన చిన్న చిత్రం డిజిటల్ వేదికపై మంచి స్పందన పొందడంతో, ఇప్పుడు అదే జోడీ పూర్తి స్థాయి చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. శివిన్ నారంగ్, ప్రేరణ అరోరా, కిరణ్ బల్లపల్లి నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ భాగస్వామ్యంతో ఈ చిత్రం ప్రతిష్ఠాత్మకంగా రూపొందనుంది.ఈ చిత్ర నిర్మాత ప్రేరణ అరోరా గతంలో హిందీ చిత్రరంగంలో విజయవంతమైన పలు చిత్రాలను నిర్మించి ప్రత్యేక గుర్తింపు పొందారు. ప్రస్తుతం రూపొందుతున్న ఈ మానసిక ఉత్కంఠభరిత కథలో అనుపమ ఇప్పటివరకు చేయని భిన్నమైన పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. కథలో భావోద్వేగాలు, ఉత్కంఠ, మానసిక సంఘర్షణలకు ప్రాధాన్యం ఉంటుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి.

మే నెలలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుండగా, టైటిల్‌ను త్వరలో ప్రకటించనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఇప్పటికే ప్రేమమ్, కార్తికేయ 2, రాక్షసుడు వంటి విజయాలతో దక్షిణాదిలో బిజీ హీరోయిన్‌గా మారిన అనుపమ, ఈ కొత్త చిత్రంతో తన నటనలో మరో కోణాన్ని చూపించబోతున్నట్లు అభిమానులు ఆశిస్తున్నారు. పుట్టినరోజు సందర్భంగా వచ్చిన ఈ ప్రకటనతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తుండగా, అనుపమ కొత్త పాత్రపై సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



## హాలీవుడ్ వైపు అడుగులు..
# ఇండో–అమెరికన్ చిత్రంలో ప్రియమణి ప్రధాన పాత్ర

టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు తన నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించిన నటి ప్రియమణి ఇప్పుడు అంతర్జాతీయ చిత్రరంగం వైపు అడుగులు వేస్తోంది. ఇండో–అమెరికన్ నేపథ్యంతో తెరకెక్కుతున్న ఓ అంతర్జాతీయ చిత్రంలో ఆమె ప్రధాన పాత్రకు ఎంపికైనట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు మోహిత్ రైనా కీలక పాత్రలో నటించనున్నారు. దర్శకుడు హర్ష్ మహదేశ్వర్ ఈ ప్రాజెక్ట్‌కు దర్శకత్వం వహించనుండగా, అమెరికాకు చెందిన నిర్మాణ సంస్థతో పాటు ముంబైకి చెందిన నిర్మాణ సంస్థ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నాయి. భారతీయ–అమెరికన్ సంస్కృతుల మధ్య పెరిగే భావోద్వేగ అనుభవాలను ప్రధానంగా తీసుకుని కథ రూపొందుతున్నట్లు సమాచారం. విదేశాల్లో నివసించే ఒక వలస కుటుంబం ఎదుర్కొనే భావోద్వేగ ప్రయాణం, సంబంధాల విలువ, సంస్కృతుల మధ్య ఉన్న తేడాలను ఈ చిత్రంలో చూపించనున్నారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సాంకేతిక నిపుణులు ఈ ప్రాజెక్ట్‌లో భాగమవుతున్నారని చిత్ర వర్గాలు వెల్లడించాయి. ఏప్రిల్ నెలలో షూటింగ్ ప్రారంభం కానున్న ఈ చిత్రం ద్వారా ప్రియమణి హాలీవుడ్‌లోకి అడుగుపెట్టడం విశేషంగా మారింది. ఇప్పటికే పలు భాషల్లో నటిగా తన ప్రతిభను నిరూపించుకున్న ఆమె, ఈ కొత్త ప్రాజెక్ట్‌తో అంతర్జాతీయ స్థాయిలో మరో గుర్తింపు పొందే అవకాశముందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# మాల్స్‌లో పని నుంచి స్టార్ హీరోయిన్‌గా.. ఐశ్వర్య రాజేష్ ప్రేరణాత్మక ప్రయాణం



సినిమా రంగంలో హీరోయిన్‌గా నిలదొక్కుకోవడం సులభం కాదు. ఎన్నో కష్టాలు, నిరాశలు, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొని విజయాన్ని సాధించిన హీరోయిన్లు చాలా మందే ఉన్నారు. అలాంటి వారిలో ఒకరు ఐశ్వర్య రాజేష్. ఒకప్పుడు కుటుంబ పరిస్థితుల కారణంగా మాల్స్‌లో పని చేసిన ఆమె, నేడు టాలీవుడ్‌లో కంటెంట్ ఉన్న పాత్రలను ఎంచుకుంటూ సక్సెస్‌ఫుల్ హీరోయిన్‌గా నిలిచింది. చైల్డ్ ఆర్టిస్ట్‌గా తన కెరీర్‌ను ప్రారంభించిన ఐశ్వర్య, మొదట తమిళ చిత్రాల్లో నటించి గుర్తింపు పొందింది. తరువాత తెలుగు చిత్రాల్లో అడుగుపెట్టి తక్కువ సమయంలోనే మంచి పేరు సంపాదించింది. అయితే ఆమె వ్యక్తిగత జీవితం మాత్రం ఎన్నో కష్టాలతో నిండిపోయిందని గతంలో ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించింది. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోవడం కుటుంబంపై పెద్ద భారం అయ్యిందని తెలిపింది. తల్లి నాగమణి కుటుంబాన్ని నిలబెట్టేందుకు ఎన్నో పనులు చేస్తూ పిల్లలను పెంచిందని ఐశ్వర్య గుర్తుచేసుకుంది. డాన్సర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆమె తల్లి, పెళ్లి తర్వాత ఆ రంగాన్ని వదిలి కుటుంబ పోషణ కోసం బీమా ఏజెంట్‌గా, రియల్ ఎస్టేట్ రంగంలో కూడా పనిచేసిందని తెలిపింది. అప్పుల కారణంగా చెన్నైలో ఉన్న స్వంత ఇంటిని అమ్ముకుని అద్దె ఇంటికి మారాల్సి వచ్చిన రోజుల్ని కూడా ఆమె గుర్తు చేసుకుంది. పదో తరగతి చదువుతున్నప్పటి నుంచే ఐశ్వర్య పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేస్తూ కుటుంబానికి అండగా నిలిచింది. మాల్స్‌లో ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొంటూ చిన్న మొత్తంలో సంపాదించిన డబ్బుతో ఇంటికి సహాయం చేసేదట. ఆ తర్వాత రియాలిటీ డాన్స్ కార్యక్రమంలో విజేతగా నిలవడం ఆమె జీవితంలో మలుపు తీసుకొచ్చింది. అయితే అదే సమయంలో కుటుంబంలో మరో విషాదం చోటుచేసుకుని ఆమె సోదరుడు ప్రమాదంలో మరణించడంతో కుటుంబం మళ్లీ కష్టాల్లో పడింది.

ఈ కష్టాలన్నింటినీ అధిగమించి నేడు హీరోయిన్‌గా ఎదిగిన ఐశ్వర్య రాజేష్, తన తల్లినే తన జీవితంలో ప్రేరణగా భావిస్తున్నట్లు చెప్పింది. తల్లి చేసిన త్యాగాలే తనను ఈ స్థాయికి తీసుకువచ్చాయని పేర్కొంది. సాధారణ కుటుంబం నుంచి వచ్చి కష్టపడి సాధించిన ఈ విజయ ప్రయాణం ఎంతో మందికి ప్రేరణగా నిలుస్తోంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in